ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

బుధవారం | 01-07- 2026 | సంపుటి: 17, సంచిక: 88, నిజామాబాద్, పేజీలు : 12, వెల : 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




### హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన

# భవిష్యత్‌కు దిశానిర్దేశం

**ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ**

గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్స్ పనులు త్వరలో ప్రారంభం...

కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

'మేడ్ ఇన్ తెలంగాణ' ఇప్పుడు ప్రపంచ అత్యాధునిక యుద్ధ విమానాల్లో ఎగురుతోంది : మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 30 (ప్రజాకలం) :** ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ & డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్

తరువాయి 2వ పేజీలో...

### వ్యవసాయం అంటే

# పండగలా తీర్చిదిద్దుతాం

## ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు

గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్/ఖమ్మం, జూన్ 30 (ప్రజాకలం న్యూస్) రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకాటి శ్రీహరి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా,

తరువాయి 2వ పేజీలో...



## కలం కౌంటర్




### ఢిల్లీ దర్బార్‌కు

# తెలంగాణ ఏటీఎం



## కాంగ్రెస్‌పై నితిన్ నబీన్ విమర్శలు

**తెలంగాణ ప్రజలు బీజేపీ వైపే**

**కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన**

మల్కాజిగిరి జూన్ 30 (ప్రజాకలం న్యూస్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్ లో బేజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశ కొనసాగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్ లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు..

తరువాయి 2వ పేజీలో...

### కాంగ్రెస్ ది.. రైతు ఆశీర్వాద సభ కాదు..

# రైతు వంచన సభ

## సీఎం రేవంత్ పాలమూరు పరువు తీస్తుండు

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం - కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సుభిక్షం

జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు



జడ్చర్ల జూన్ 30 (ప్రజాకలం న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి కూడా తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడుతన్నారని, ఉద్యమం కంటే ఉద్యమమే ముఖ్యమని శ్రీనివాస్ గౌడ్ పోరాటం చేశారని గుర్తుచేశారు.

తరువాయి 2వ పేజీలో...

## కేసీఆర్ రైతు బాంధవుడు..

**మీరు ఎప్పటికీ రైతు ద్రోహి: - సీఎంపై కేటీఆర్ విమర్శలు**




**హైదరాబాద్, జూన్ 30 (ప్రజాకలం) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. 30 నెలల పాలలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఏకంగా నాలుగు సార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు.

తరువాయి 2వ పేజీలో...

### మీ పెత్తనం

# మాకొద్దు

## పీవోకే లో 22వ రోజుకు చేరిన నిరసనలు

పీఓకే ఇకపై పాకిస్థాన్ కంట్రోల్‌లో ఉండదు

మాకు పాకిస్థాన్‌తో అవసరం లేదు

పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చిన పీఓకే నేతలు






## భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

**భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి**

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30 (ప్రజాకలం న్యూస్) జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లు గప్పేందుకు లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు లారీని సోదా చేసి, దాదాపు 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్‌లో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న లారీతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### ఓటు హక్కు కోల్పోతే,

## పథకాలూ కోల్పోతారు

**- కర్ణాటక సీఎం హెచ్చరిక**



బెంగుళూరు : కర్ణాటకలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక హెచ్చరిక చేశారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు హక్కే కాకుండా, భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి రావచ్చని ఆయన హెచ్చరించారు. ఈ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి...

చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ లో భాగంగా 25 లక్షల 35 వేల మంది రైతులకు 20 వేల 677 ఓట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 27 వేల కోట్ల రూపాయల రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ప్రస్తుతం 9 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల కోట్ల రూపాయల బోనస్, 2 వేల కోట్ల రూపాయలతో పనిముట్లు, రైతు భీమా పథకం కొరకు 3 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారాహొహొరైతుల వద్ద నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 వేల కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1 లక్ష 75 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు చేయడం జరిగిందని, సరాసరి ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. నష్టాలలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 1 వేయి కోట్ల లాభాలలోకి తీసుకురావడం జరిగిందని, సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రెవెన్యూ శాఖలో భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా మహాలక్ష్మి పథకంలో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయలు ఆర్ టి సి సంస్థకు చెల్లించామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, పెట్రోల్ బంకులు నడిపించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, హైదరాబాద్ లోని ఐ.టి. సంస్థల మధ్య 1 వేయి కోట్ల రూపాయల భూమిని ఇందిరా మహిళ భవన్ కు కేటాయించి స్వయం సహాయక సంఘాల ద్వారా 150 షాపులు ఏర్పాటు చేసి నిర్వహణకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో దాదాపు 8 వేల స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒకేసారి సమావేశం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్ 1 నిర్వహించి 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని, గ్రూప్ 2 లో 1 వేయి 100 మంది, అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంట సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా ప్రభుత్వమని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాగులవంచ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**యాదాద్రి ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**

తెలంగాణ తిరుపతిగా పిలవబడే యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళ వారం నాడు సమీక్ష నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు మార్కెట్ రేటు ప్రకారం భూమి కేటాయించాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మఠాలు కేటాయింపుపై సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు. అలాగే కుల సంఘాలకు స్థలాల కేటాయింపుపై స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానాన్ని తీసుకురావాలని అధికారులకు సూచించారు. భూముల యాజమాన్య హక్కులు ఆలయం వద్దనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూముల కేటాయింపులో తిరుమల తిరుపతి దేవస్థానం మోడల్‌ను అధ్యయనం చేసి అనుసరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. యాదగిరిగుట్టపై గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి ముందుకు వచ్చిన వాళ్ల జాబితాను సిద్ధం చేయాలని, విడతల వారీగా గెస్ట్‌హౌస్‌ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. గెస్ట్‌హౌస్‌ల నిర్మాణంలో కూడా తిరుమల మోడల్‌ను అమలు చేయాలని వెల్లడించారు. భూసేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని, యాదాద్రి ఆలయ నిర్మాణంపై ఇంజనీర్ల కమిటీ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి వారం రోజుల్లో తుది నివేదిక అందించాలని ఆదేశించారు. అట్లనే పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కీలక సమీక్షకు రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ లు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఎల్ ఏ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సీఎంఓ సెక్రటరీ మానిక్ రాజ్, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, యాదాద్రి జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ అధికారులు హాజరయ్యారు.

## మీ పెత్తనం మాకొద్దు



### పీవోకే లో 22వ రోజుకు చేరిన నిరసనలు

### పీఓకే ఇకపై పాకిస్థాన్ కంట్రోల్‌లో ఉండదు

### మాకు పాకిస్థాన్‌తో అవసరం లేదు

### పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చిన పీఓకే నేతలు

రావల్‌కోట్: ఇస్లామాబాద్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. 22వ రోజు నిరసన కార్యక్రమం సందర్భంగా పీఓకే నేతలు పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. పీఓకే ఇకపై పాకిస్థాన్ కంట్రోల్‌లో ఉండదని తేల్చి చెప్పారు. తమకు పాకిస్థాన్‌తో అవసరం లేదని అన్నారు. మంగళవారం రావల్‌కోట్‌లోని ఈద్గా గ్రౌండ్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో నిరసనకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏఏసీ నేతలు మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ పాకిస్థాన్‌లో భాగం కాదని అన్నారు. ఆహార సరఫరాలపై ఆంక్షలు విధిస్తే భారత్ సాయం తీసుకుంటామని చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ నియంతలా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

**వివాదానికి కారణాలు ఇవే..**

వచ్చే ఎన్నికల కోసం పీఓకే అసెంబ్లీలోని మొత్తం స్థానాల్లో 12 సీట్లను కాశ్మీరీ శరణార్థుల కోసం పాకిస్థాన్ ప్రభుత్వం కేటాయించింది. ఈ శరణార్థులు పీఓకేలో కాకుండా పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ వంటి ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దీన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 12 స్థానాల రిజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు అధిక కరెంట్ బిల్లులు, కోతలు పీఓకే ప్రజల్ని వేధిస్తున్నాయి. పాకిస్థాన్‌కు అవసరమైన అత్యధిక హైడ్రో పవర్ పీఓకేలోని మంగ్లా డ్యామ్ ద్వారానే ఉత్పత్తి అవుతోంది. కానీ, స్థానిక ప్రజలకు మాత్రం పాక్ ప్రభుత్వం అధిక విద్యుత్ బిల్లులు వసూలు చేస్తోంది. గంటల తరబడి పవర్ కట్ విధిస్తోంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. పాకిస్థాన్‌లో ఉన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వల్ల అక్కడ గోధుమ పిండి, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేయడంతో సామాన్యులు తినడానికి తిండి లేక అల్లాడిపోతున్నారు. బియ్యం, విద్యుత్, గోధుమ పిండి వంటి నిత్యావసరాల ధరలు తగ్గించాలని, ప్రాథమిక హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది శాంతియుతంగా గత 22 రోజుల నుంచి నిరసనలు తెలియజేస్తున్నారు.

# హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

మొదటి పేజీ తరువాయి...

ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, "ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా" అని స్పష్టం చేశారు.

భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. "ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి" అని చెప్పారు.

అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు.

"'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది" అని పేర్కొన్నారు.

స్పెయిన్‌కు చెందిన ITP Aero, కెనడాకు చెందిన FTG Aerospace వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు.

డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు.

తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌర-సైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు.

ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు.

ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం" అని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

"ఏరోమార్ట్ హైదరాబాద్--2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ది.. రైతు ఆశీర్వాద సభ కాదు..

# రైతు వంచన సభ

మొదటి పేజీ తరువాయి...

సీఎం రేవంత్ పాలమూరు పరువు తీస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పెట్టుకోవాల్సింది రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అని ఎద్దేవా చేశారు. యాసంగి రైతుబంధు పూర్తి స్థాయిలో వేయలేదని హరీశ్ రావు ఆరోపించారు. ఇవాళ వానాకాలం రైతుబంధు వేస్తమంటున్నారని తెలిపారు. కేసీఆర్ చేతిలో ఉంటేనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ రూ. 29,300 కోట్లు రైతులకు బాకీ పడిందని చెప్పిన హరీశ్ రావు ఈ మొత్తం రైతులకు ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ సర్కార్ పంటలకు ఇస్తామన్న బోనస్ బోగస్ గా మారిందని హరీశ్ రావు చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు యూరియాకు ఎప్పుడైనా ఇబ్బందులు వచ్చాయా? అని ప్రశ్నించారు. షాపులో యూరియా ఉంటే యాప్ ఎందుకన్నారు. షాపులో లేదు కాబట్టే యాప్ అంటూ కథలు చెబుతున్నారని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలైందా?, రుణమాఫీ చేస్తామన్నారు..జరిగిందా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల నాటికి మూసీ ప్రాజెక్టు పూర్తిచేస్తామని రేవంత్ రెడ్డి ఒట్టు వేశారు. ఎన్నికల ముందు కనిపించిన దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు వేశారని స్పష్టం చేశారు. ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేస్తామన్నారు..చేయలేదు.. పాలమూరు పరువు తీసేలా రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు.

# కేసీఆర్ రైతు బాంధవుడు..

మొదటి పేజీ తరువాయి...

**కేటీఆర్ పోస్ట్..**

'మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు.

# ఓటు హక్కు కోల్పోతే, పథకాలూ కోల్పోతారు

మొదటి పేజీ తరువాయి...

'ఓటు హక్కు అంటే జీవించే హక్కు. ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. పశ్చిమ బెంగాల్‌లో అనర్హ రేషన్ కార్డు లబ్దిదారులను గుర్తించేందుకు ఇలాంటి విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే తరహా చర్యలు చేపడుతున్నాయి. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే అవకాశం ఉంది' అని శివకుమార్ పేర్కొన్నారు

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం నుంచి జూలై 29 వరకు కర్ణాటకలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించే కార్యక్రమం కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. కాగా, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు కర్ణాటక ప్రభుత్వం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌తో పాటు ప్రభుత్వ సేవా కేంద్రాల్లో కూడా పొందవచ్చు. ఇది నివాసానికి అధికారిక ఆధార పత్రంగా ఉపయోగపడుతుంది.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



## - ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు

(వరంగల్ /పర్వతగిరి) జూన్ 30, ప్రజాకలం ప్రతినిధి.

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం పర్వతగిరి రైతు వేదికలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, రైతులతో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభలో ల్యాప్‌ట్యాప్‌లో బటన్ నొక్కి ఈ నిధుల పంపిణీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నేడు తొలి విడత నిధులను విడుదల చేసిందన్నారు. మొదటి విడత కింద రెండు ఎకరాల లోపు భూమి ఉన్న 41.37 లక్షల మంది చిన్న, సన్నకారు రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 2,482.02 కోట్లను ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. తొలి విడత కింద ఎకరాకు రూ. 6,000 చొప్పున లబ్ధిదారులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందన్నారు. రైతు భరోసా నిధుల బదిలీ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటుందని అన్నారు. రైతుల ఖాతాల్లో జమ అయ్యే ఈ సాయాన్ని బ్యాంకులు వారి పాత రుణ బకాయిల కింద మినహాయించుకోవడానికి వీల్లేదని, ఈ నిధులు పూర్తిగా రైతుల సాగు అవసరాలకే దక్కేలా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రతి రైతుకు ఎకరానికి రూ.12,000 పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొమ్మిది రోజుల్లో 9వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు అండగా నిలువాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం పర్వతగిరి అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ యాకుబ్, వరంగల్ ఎనుమాముల మార్కెట్ చైర్మెన్ ప్రియాంక, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, హన్మకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు జాటోతూ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ శంకర్, జిల్లా, మండల, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ దర్బార్‌కు

# తెలంగాణ ఏటీఎం

మొదటి పేజీ తరువాయి...

బీజేపీ కార్యకర్తల కష్టాలతో పశ్చిమ బెంగాల్ లో గెలిచామని నేను చెప్పాను.

బెంగాల్ లో బీజేపీ కార్యకర్తలను చాలా ఇబ్బందులు గురిచేశారు. పశ్చిమబెంగాల్ లో బీజేపీని గెలిపించాలనే ఆలోచనలతోనే కార్యకర్తలు పనిచేశారని వివరించారు.

**తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్.. తెలంగాణ నుంచే ఢిల్లీకి డబ్బులు**

తెలంగాణలో సర్ పై ప్రజలకు బీజేపీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో సర్ పై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని వెల్లడించారు. మోదీ నేతృత్వంలో బీజేపీ వెంట నడిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వెల్లడించారు. బీజేపీని గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ లో ఆర్ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారని చెప్పిన నితిన్ నబీన్ తెలంగాణ నుంచి ఢిల్లీకి డబ్బులు వెళ్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఆరో గ్యారెంటీలు ఇంకా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, ఎంఐఎం బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఢిల్లీ దర్బార్ కు తెలంగాణ ఏటీఎం**

కాంగ్రెస్ ప్రభుత్వంపై నితిన్ నబీన్ విమర్శలు చేశారు. తెలంగాణలో బడుగు, బలహీనవర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. ఒక్క గ్యారెంటీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్ కు తెలంగాణను ఏటీఎంగా మార్చిందని నితిన్ నబీన్ ఆరోపించారు. ఆర్ ఆర్ ట్యాక్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి ఢిల్లీ దర్బార్ కు పంపిస్తున్నారని వివరించారు.

తెలంగాణ ప్రజల సొమ్ము ట్యాక్స్ పేరుతో ఢిల్లీకి పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం చేయాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని నబీన్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు పోరాటం చేయాలన్నారు.

## మిత్రుడి జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ కల్చరల్ సభ్యుల అన్నదానం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం)

చిన్ననాటి నుంచి కలిసి పెరిగి, స్నేహబంధాన్ని పంచుకున్న మిత్రుడు మైలారపు ప్రశాంత్ (సురేష్) అకాల మరణం చెందడంతో ఆయన స్మారకార్థం ఫ్రెండ్స్ కల్చరల్ సభ్యులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులకు భోజనాలను అందజేశారు. మిత్రుడి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని స్నేహితులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిట్లుగు కార్తీక్, ఆగ సురేష్, కమటం భరత్, పారిపెల్లి రాజు, చిట్యాల అరుణ్, కోట రాజేందర్, బాలే రాజ్‌పాల్, కట్ట లక్ష్మణ్, పారిపెల్లి సుధాకర్, రాంపెల్లి నాగేశ్, సొగాల అంజి, అలాగే అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పుల్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్ పోస్టులకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ

### - ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్

పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)




పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ ప్రోగ్రాం కింద ఖాళీగా ఉన్న ఒక మెడికల్ ఆఫీసర్ పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండటంతో పాటు,తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లేదా నేషనల్ మెడికల్ కమిషన్‌లో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగి ఉ ండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు,రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రం మరియు ఇతర సంబంధిత ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో జులై 1న ఉదయం 11గంటలకు రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె కోరారు. ఈ నియామకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆసుపత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

## మహిళల సాధికారతకు దిశ ఫౌండేషన్ కృషి అభినందనీయం

### - జువ్వాడి నర్సింగ్ రావు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం) మహిళల రక్షణ, భద్రత, సాధికారత, వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్



ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగిత్యాల జిల్లా కమిటీ పరిచయ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన శ్రీదేవిని జువ్వాడి నర్సింగ్ రావు అభినందించారు. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణ, సామాజిక చైతన్యం మరియు మహిళా సాధికారత కోసం సంస్థ చేపట్టే కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సమాజంలో మహిళలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన ప్రశంసించారు.మహిళల అభ్యున్నతి, సమాన హక్కులు మరియు భద్రత కల్పనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, ఇటువంటి సంస్థలకు ప్రజలు, ప్రభుత్వాలు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ చేయూత



పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమం స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంది.గ్రామంలోని జడ్పీ ఉ న్నత పాఠశాల,అప్పర్ ప్రైమరీ,ప్రైమరీ మరియు ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు భోజన సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో,సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా భోజన ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ తాడిచెట్టి చామంతి శ్రీకాంత్, విద్యార్థులకు స్వయంగా ప్లేట్లను అందజేస్తూ,సమాజ శ్రేయస్సు కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని,ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెంతో మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హనుమంతు,సతీష్, దేవేందర్ రెడ్డిలు పాల్గొని విద్యార్థుల అవసరాల పట్ల హెల్పింగ్ హాండ్స్ సభ్యులు చూపిస్తున్న చొరవను అభినందించారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రాజ్ కుమార్,కనుకయ్య,లక్ష్మణ్,సదయ్య,వంశీలతో పాటు పాఠశాల సిబ్బంది,విద్యార్థులు,గ్రామస్థులు,తదితరు పాల్గొన్నారు.

### మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై

# అసత్య ప్రచారాలు మానుకోవాలి

### - మెట్‌పల్లి కాంగ్రెస్ హెచ్చరిక

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం):

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణిపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. డీప్‌ఫేక్, ఏఐ సాంకేతికతలను దుర్వినియోగం చేస్తూ మంత్రి దంపతుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ మంథని బీఆర్ఎస్ నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. టీ.పి.సి.సి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులపై అనుచిత పోస్టులు పెట్టడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు.ఇటువంటి చర్యల ద్వారా కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబుకు మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు, విశ్వసనీయత ఉందని,ఆయనకు పెద్ద సంఖ్యలో అభిమానులు, అనుచరులు ఉన్నారనే విషయాన్ని రాజకీయ




ప్రత్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, సోషల్ మీడియా దాడులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి తప్పుడు ప్రచారాలు కొనసాగితే చట్టపరంగా,రాజకీయంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే అసత్య ప్రచారాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుతుబ్ పాషా, కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్, యువ నాయకులు నల్లూరి సాగర్, బైండ్ల శ్రీకాంత్, దినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్లూరి పరమాచారి సేవలు మరువలేనివి

### - జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.రాజేశ్వర్

### - పదవీ విరమణ చేసిన డీఈ వడ్లూరి పరమాచారికి ఘన సన్మానం




పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి హౌసింగ్ కార్పొరేషన్ డివిజనల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించి,పదవీ విరమణ పొందిన వడ్లూరి పరమాచారి నలభై ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ సేవా ప్రస్థానంపై ప్రశంసల జల్లు కురిసింది.మంగళవారం ఆయన గౌరవార్థం జరిగిన వీడ్కోల సమావేశంలో జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.రాజేశ్వర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పెద్దపల్లి డివిజన్‌లో ఎంతో అంకితభావంతో పనిచేస్తూ,తోటి సిబ్బందితో కుటుంబ సభ్యునిగా మెలిగిన పరమాచారి వివాదరహితుడిగా విశిష్ట సేవలు అందించారని,వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అనంతరం మంథని డివిజనల్ ఇంజనీర్ దస్తగిర్,అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ పనే దైవంగా భావించి నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ సంస్థల్లో నిస్వార్థంగా పనిచేసిన పరమాచారి ఆయురారోగ్యాలతో సుఖసంతోషకరమైన శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు వడ్లూరి పరమాచారి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ సహాయక ఇంజనీర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### పేద గర్భిణీలకు విశ్వహిత సేవా ట్రస్ట్

# ఉచిత ప్రసూతి సేవలు

### - పోస్టర్ ఆవిష్కరించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్న గర్భిణీ స్త్రీల పాలిట విశ్వహిత సేవా ట్రస్ట్ ఆశాదీపంగా మారింది.విశ్వహిందూ పరిషత్ సారథ్యంలో, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ సహకారంతో పేద గర్భిణీలకు పూర్తిగా ఉచితంగా ప్రసూతి సేవలను అందించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది.ఈ మేరకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను మంగళవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ నేటి కాలంలో ప్రసూతి వైద్యం భారంగా మారుతున్న తరుణంలో,పెద్దపల్లి జిల్లా ప్రజల కోసం ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.సమాజ హితమే లక్ష్యంగా చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.అనంతరం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో



అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రసూతి సేవలను ఆర్థికంగా వెనుకబడిన వారికి పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు.కేవలం ప్రసవమే కాకుండా, పుట్టిన శిశువుల ఆరోగ్య పరిరక్షణకు కూడా తాము ప్రత్యేక ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు.ఈ సేవలను వినియోగించుకోవాల నుకునే గర్భిణీ స్త్రీలు,వివరాల కోసం 9492202108 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు,ట్రస్ట్ ప్రతినిధులు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

### - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

### - సర్ ప్రక్రియపై అవగాహన సదస్సుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లి:(కోరుట్ల ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం)

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి, రాజేశ్వరరావుపేట, చెర్లకొండాపూర్, జగ్గాసాగర్, ఆత్మనగర్, రామలచక్కపేట గ్రామాల్లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. బూత్ స్థాయి నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే సంజయ్, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత రాష్ట్ర సమితి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

# విడుదల చేయాలి

### - ఆర్డీవోకు బీసీ విద్యార్థి సంఘం వినతి

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జగిత్యాల జిల్లా ఉ పాధ్యక్షుడు జెట్టి నరేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థుల భవిష్యత్తును




దెబ్బతీసే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా చేసే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తుండటంతో వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు, యువజన సంఘాలు, ఇతర వర్గాలతో కలిసి ఉ ద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ యాదవ్, ఎండి ముక్తార్, చరణ్, మహేశ్, కారం సాయివర్ధన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌లో షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన జువ్వాడి నర్సింగ్ రావు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం) పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని గోధూర్ రోడ్ డంపింగ్ యార్డ్ వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ షెడ్ నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఎస్ఎఫ్‌సీ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లతో కలిసి జువ్వాడి నర్సింగ్ రావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ డీఆర్‌సీసీ షెడ్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలతో ఆదాయం

### -జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాం ప్రసాద్

పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ మార్పులు మరియు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉ న్నందున,రైతులు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగును చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు.ఆయిల్‌పామ్ నాటిన తొలి మూడు సంవత్సరాల వరకు మొక్కల మధ్య ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ కూరగాయలు,పూల పంటలు, పసుపు,అరటి, బొప్పాయి,అల్లం వంటి పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం



పొందవచ్చని, ఈ విధానం భూసారాన్ని మెరుగుపరచడమే కాకుండా కలుపు మొక్కల నివారణకు, నేలలో తేమ నిల్వ ఉండటానికి దోహదపడుతుందని ఆయన వివరించారు.2026-27 ఆర్థిక సంవత్సరంలో భాగంగా ఎంఐడిహెచ్ పథకం ద్వారా కూరగాయల సాగుకు నాణ్యమైన మొక్కలు,మల్చింగ్ షీట్లపై సబ్సిడీ మరియు అరటి,బొప్పాయి, పసుపు పంటలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని,ఎన్ఎంఈఓ-ఆయిల్‌పామ్ పథకం కింద సాగు విస్తరణకు సబ్సిడీ, ఆర్కేవీవై- పిడిఎంసి ద్వారా డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు సబ్సిడీ కల్పిస్తూ 40 నుండి 60 శాతం నీటిని ఆదా చేసే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు ద్వారా నెలవారీ నగదు ప్రవాహాన్ని పొందుతూ,దీర్ఘకాలంలో ఆయిల్‌పామ్ ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని భరోసా ఇస్తూ,ఆసక్తి గల రైతులు మరిన్ని వివరాల కోసం సమీప మండల ఉద్యాన అధికారిని లేదా జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

## జూలై 2న ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడి,ప్రభుత్వం జప్తు చేసిన ఆరు వాహనాలకు



జూలై 2న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పెద్దపల్లి ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.కరీంనగర్ డివిజన్ అబ్కారీ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం ఈ వేలం ప్రక్రియను చేపడుతున్నట్లు వారు వెల్లడించారు.ఈ వేలం కార్యక్రమం జూలై 2న ఉ దయం 11 గంటలకు పెద్దపల్లిలోని బందారకుంట వద్ద ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో,జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.వేలంలో పాల్గొనాలనుకునే వారు అదే రోజు ఉదయం 9 గంటల నుండి 10 గంటల మధ్య కార్యాలయంలో ధరావత్తు సొమ్మును డిపాజిట్ చేసి రసీదు పొందవలసి ఉంటుంది.ఈ వేలం మరియు వాహనాలకు సంబంధించిన మరిన్ని ఇతర వివరాల కోసం ఆసక్తి గల వ్యక్తులు కార్యాలయ పని వేళల్లో పెద్దపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అధికారులు ఆ ప్రకటనలో సూచించారు.

ప్రజా కలం
బుధవారం, జూలై 1, 2026

# ఆర్థిక నేరాలకు అంతం ఎప్పుడు

దేశవ్యాప్తంగా ఏడాదికి లక్షల మంది సైబర్ నేరగాళ్ల మాయాజాలంలో చిక్కుతుంటే, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 30వేల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. రోజూ సగటున రూ.కోటి నేరగాళ్ల పరం అవుతుండటమే కాదు. ఆ సొమ్ము సరిహద్దులు దాటిపోతుండటం దేశ ఆర్థిక భద్రతకు సవాలుగా నిలుస్తోంది. ఈ డబ్బులు డ్రగ్స్ అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటి కార్యకలాపాలకు ఇంధనంగా మారుతుండటం జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమిస్తోంది. మరోవైపు ఈ అధిక క్రైమ్‌రేట్‌లో చాలా మంది చదువుకున్న యువకులే సైబర్ నేరాల బారినపడుతున్నారు. ఎంత అవగాహన కల్పించనప్పటికీ ఇంకా సైబర్ నేరాల బారినపడుతూనే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజు సుమారు 2400 మంది 1930 నంబరును సంప్రదిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి సంబంధించి డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల రాష్ట్రంలోని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఎస్‌హెచ్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రోజుకు సగటున 108 ఆర్థిక నేరాలు నమోదవుతున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) 2024 గణాంకాలు చెబుతున్నాయి.దేశవ్యాప్తంగా నమోదవుతున్న వాటిలో 18 శాతం తెలంగాణలోనే నమోదవుతున్నట్లు ఈ నివేదికలో తేలింది.మిగిలిన రాష్ట్రాల కంటే తెలంగాణలో అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తున్న కారణంగా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు ఎక్కువగా ఉండటం దీనికి ఓ కారణంగా చెప్పవచ్చని ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనిల్ రాచమళ్ల బీబీసీతో చెప్పారు.ప్రజల్లో ఉన్న 'ఆశ'ను నేరగాళ్లు క్యాష్ చేసుకుంటూ.. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.ఇందులో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో అత్యధికంగా 39,127 ఆర్థిక నేరాలు రికార్డ్ అయ్యాయి.తెలంగాణలో అత్యధికంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలోనే ఎక్కువగా ఆర్థిక నేరాలు రిపోర్ట్ అవుతున్నట్లు చెబుతున్నారు పోలీసులు."మోసపోయిన మొత్తం రూ.2 కోట్లకు పైబడి ఉంటేనే ఆర్థిక నేరాల విభాగం వద్ద రిపోర్ట్ అవుతున్నాయి. సైబరాబాద్‌లో రూ.3 కోట్లకు పైబడిన కేసులు రిపోర్ట్ అవుతుంటాయి. అంతకన్నా తక్కువ మొత్తంలో ఉంటే, అలాంటి నేరాలను స్థానిక పోలీస్ స్టేషన్లకు రిఫర్ చేస్తున్నాం" అని మనోహర్ చెప్పారు.ప్రజల్లో పెట్టుబడుల నుంచి రాబడిపై అత్యాశ పెరిగిపోయి ఈ తరహా మోసాలకు అవకాశం ఏర్పడుతోందని ఆయన చెప్పారు.హైదరాబాద్ పరిధిలో రూ.75 లక్షలకు మించిన మోసాల్లో ఆర్థిక నేరాల విభాగం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారుఆర్థిక నేరాల్లో ఎక్కువగా ఫోర్జరీ, చీటింగ్, ఫ్రాడ్ కేసులే రిపోర్ట్ అవుతున్నట్లు ఎన్సీఆర్బీ నివేదిక చెబుతోంది."మా వద్దకు వస్తున్న చాలా కేసుల్లో.. ముందుగా బాధితులు కొంతమొత్తం పెట్టుబడి పెడుతున్నారు. దానిపై ఎంతో కొంత లాభం గడిస్తున్నారు. తర్వాత ఇంకొంత పెట్టుబడి పెడుతున్నారు. దానికీ లాభం వస్తోంది.మోసగాళ్లు అలా వారిని నమ్మించిన తర్వాత ఒకేసారి పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టమని చెబుతున్నారు. పెట్టిన వెంటనే నిందితులు బోర్డు తిప్పేయడం లేదా డబ్బుతో ఉడాయించడం జరుగుతోంది. అప్పుడు మోసపోయామని బాధితులు గ్రహిస్తున్నారు.పెట్టుబడికి తగ్గట్టుగా కాకుండా ఎక్కువగా లాభాలు ఇస్తున్నారంటేనే అనుమానించి, డబ్బులు పెట్టకపోతే మోసపోకుండా ఉండేందుకు వీలుంటుంది" అని ఒక పోలీసు అధికారి చెప్పారు.దేశవ్యాప్తంగా నమోదైన ఆర్థిక నేరాల్లో 1,92,382 నేరాలు ఈ మూడు కేటగిరీల్లోనే ఉన్నాయి. తెలంగాణ విషయానికి వస్తే 38,312 నేరాలు ఈ కేటగిరీలోనే నమోదయ్యాయి.ఇందులో రియల్ ఎస్టేట్ మోసాలు ఎక్కువగా రిపోర్ట్ అవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో ముందుగానే డబ్బులు కట్టించుకుని, తిరిగి సమయానికి ఫ్లాట్లు అప్పగించకపోవడంతో బాధితులు తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు"ఆర్థిక, సైబర్ నేరాల విషయంలో అవగాహన బాగా పెరిగింది. కేసుల నమోదుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటవుతున్నాయి. దానివల్ల ప్రజలు కూడా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు" అని చెప్పారు అనిల్ రాచమళ్ల.ఆర్థిక నేరాల్లో ఛార్జి షీట్ రేటు మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. 2024లో ఛార్జి షీటు రేటు 39.8 శాతంగా ఉంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా ఛార్జి షీటు రేటు 53.3 శాతంగా ఉంది."ఈ కేసుల విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు పరిశీలించాల్సి ఉంటుంది. దర్యాప్తు విషయంలో ఆర్థికంగా అనేక విషయాలను జల్లెడ పట్టాలి. బాధితులు కూడా ఒక్కరు కాకుండా ఒకే కేసులో ఎక్కువ మంది ఉంటారు. దానివల్ల ఛార్జి షీటు విషయంలో ఆలస్యమవుతోంది" అని ఓ పోలీసు అధికారి అన్నారు. : ఇళ్లలో పని మనుషులుగా చేరి నేరాలకు పాల్పడుతున్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి వారి వివరాలన్నీ సేకరించి భద్రపరచాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసులను ఆదేశించారు. సీఐడీ విభాగం బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. వచ్చే అక్టోబరులో మహిళా పోలీసు కాన్ఫరెన్స్, నవంబరులో పోలీస్ రీట్రీట్ నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిభద్రతలు, క్షేత్రస్థాయి విధుల్లో మహిళా పోలీసులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని డీజీపీ సూచించారు.

# వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై చర్యలు

## - మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం) వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మెట్ ఎన్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పేర్కొన్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, వర్షాకాల ముందస్తు చర్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని వార్డుల్లోని డ్రైనేజీల పూడికను తొలగించి శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్పందించిన చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డుల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామని, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగం.. ఒక సామాజిక సేవా

## - జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల్ ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం)

జిల్లా పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు ఎస్ ఐ లు జె. రవీందర్, పి. రామచంద్రం,ఏఎస్ఐ లు ఆర్ శ్రీనివాస్, ఎస్. అంజనేయులు, జి. సత్యనారాయణ, మహ్మద్ సంధాని, జి. మల్లారెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. కిష్టారెడ్డి లను జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించి, శాలువాలు కప్పి,



జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ, పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వేణు , సైదులు పోలీసు అధికారులు, సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



## -స్వేరోస్, ఏబిఎస్ఎఫ్

జూన్ 30, ప్రజాకలం ప్రతినిధి, వరంగల్

వరంగల్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనివల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని స్వేరోస్, ఏబిఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు శనిగరపు రాజేంద్రప్రసాద్, బొట్ల నరేష్ లు మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కనీస సౌకర్యాలు లేకపోయినా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులపై అనవసరమైన విద్యా భారం మోపుతూ వారిని మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఇటీవల జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి జారీ చేసిన ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పాత్రికేయుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆర్‌టీఈ చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకున్యాయం చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, ప్రమోద్,శ్రీకాంత్, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన పోలీసు సిబ్బంది సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి

## - జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ జూన్ 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో 1989 బ్యాచ్‌కు చెందిన సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సిబ్బందికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఒక ఉపాధి కాదని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు, ఎండా వానా తేడా లేకుండా, కుటుంబాలకు దూరంగా ఉండి విధులు నిర్వర్తించే ప్రతి పోలీసు ఉద్యోగి సమాజానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో 1989 బ్యాచ్‌కు చెందిన ఈ సిబ్బంది అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం నేటి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ విధులకు మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, తమ అనుభవాన్ని యువతకు, సమాజానికి పంచుతూ మార్గదర్శకులుగా



కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 1989 బ్యాచ్‌కు చెందిన పదవీ విరమణ పొందిన లిజె. దిగంబర్ (ఏఎస్ఐ-1704, భైంసా రూరల్ పోలీస్ స్టేషన్), డి. బాబారావు (ఏఎస్ఐ-1738, నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్), ఎం. బాలుడు (ఏఆర్‌పీసీ-3885, డీఏఆర్ నిర్మల్)లిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను ప్రశంసిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) ఎం.డి. యూనుస్ అలీ, ఆర్ఎస్ఐ శేఖర్, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పారదర్శక పాలనే లక్ష్యం

## - ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు




సుల్తానాబాద్,జూన్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సుల్తానాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు.పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అత్యంత కీలకంగా సాగింది.ఈ సమావేశానికి ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరై,పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా విజయరమణ రావు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల,తాగునీటి సమస్యల పరిష్కారం మరియు విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పౌర సౌకర్యాలపై ఆయన అధికారులతో ఆరా తీశారు.ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందాలని,ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని,చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,వైస్ ఛైర్మన్, పట్టణ కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్‌ఓగా డాక్టర్ పవిత్ర బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లి,జూన్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)



పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ పవిత్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఈ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ప్రమోద్ కుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో,ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిసిల్ల నుండి బదిలీపై వచ్చిన డాక్టర్ పవిత్ర ఈ పదవీ బాధ్యతలను చేపట్టారు.ఈ సందర్భంగా నూతన డీఎంహెచ్‌ఓ డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిర్దేశించిన వైద్య ఆరోగ్య లక్ష్యాలను గతంలో మాదిరిగానే,అందరి సహకారంతో సమర్థవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామన్నారు.ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా అందుబాటులో ఉన్న సేవలని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# రైతు భరోసా నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

## - వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం) మండలంలోని చౌలమద్ది గ్రామంలోని రైతు వేదికలో రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అందించే రైతు భరోసా ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క తో కలిసి హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి విడతలో రాష్ట్రంలోని 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,482.02 కోట్లు జమ కానున్నాయి. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతులకు రూ. 878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72 లక్షల మంది రైతులకు రూ. 1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.ఈ సందర్భంగా కూన గోవర్ధన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కట్టుబడి రైతు భరోసా నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి భాస్కర్, ఏఈఓ దీపిక, ఏఈఓ భూమేశ్వర్, ఉప సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్ పాషా, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి గిరిజన బాలికల హాస్టల్‌లో కలకలం

## హాస్టల్ భవనం పైనుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని మహేశ్వరి

వికారాబాద్ : తాండూరు మండలం జిన్గుర్తి గ్రామ శివారులో ఉన్న గిరిజన బాలికల వసతి గృహంలో జరిగిన ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మహేశ్వరి హాస్టల్ భవనం పై నుంచి దూకినట్లు సమాచారం.ఈ ఘటనలో ఆమె కాలుకు తీవ్ర గాయమై ఎముక విరగడంతో తొలుత స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి లో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.విద్యార్థిని భవనం పై నుంచి ఎందుకు దూకింది అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సమస్యల కారణంగానా, లేక ఇతర వ్యక్తిగత లేదా విద్యాసంబంధిత కారణాలున్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.ఘటనపై సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు.

## పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

### -గద్వాల నాయబ్ తహసిల్దార్ అజిత్ కుమార్



ప్రజా కలం గద్వాల ప్రతినిధి: సమాజంలో ఎవరి హక్కులకు భంగం కల్గించొద్దని గద్వాల నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ అన్నారు. గద్వాల మండలం జిల్లెడబండ గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, గ్రామీణ ప్రజల్లో పౌర హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గద్వాల నాయబ్ తాసిల్దార్ అజిత్ కుమార్ వెల్లడించారు. పౌర హక్కుల దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశాలను, దాని ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలిగేలా, పౌర హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నగేష్, జిల్లెడబండ పాఠశాల హెచ్ఎం వెంకటన్న, పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, స్థానిక పోలీస్ కానిస్టేబుల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు

ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బల్గెర గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన గిరకబండ్ల ఉ



బండలాగుడు పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై,ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతులందరికీ ఏరవాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఏరవాక పౌర్ణమి సందర్భంగా రైతు సంబరాలు నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు.ఎంతో సంబరంగా ఎద్దుల బండలాగుడుడ గిరక బండ్ల పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సాంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వం (బీఆర్ఎస్) వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి మరియు అన్నదాతల సంక్షేమం కోసం దేశంలోనే ఆదర్శవంతమైన ఎన్నో విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసింది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకి డేవిడ్, ఉప సర్పంచు బాసు గోపాల్, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

### - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

### - నిబంధనలు పాటించని ఉపాధ్యాయుడికి మెమో జారీ



ప్రజా కలం న్యూస్ (గద్వాల ప్రతినిధి)

విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేలా చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్సి ప్రతి విద్యార్థికి కీలక దశ అన్నారు. బాగా చదివితేనే తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారించి సాధన చేసేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆదేశించారు. గతేడాది పదవ తరగతి విద్యార్థులు సాధించిన మార్కుల కంటే ప్రస్తుత విద్యార్థులు ఇంకా ఎక్కువగా సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎవరైనా సెలవు పెడితే ఒకటి, రెండు రోజులు ముందుగానే సంబంధిత ఉన్నతాధికారులకు సెలవు చీటీ ఇవ్వాలని చెప్పినప్పటికీ పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు మంగళవారం ఉదయం వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మెమో జారీ చేయాలని జిహెచ్ఎం రేణుకా దేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తో పాటు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రిజిస్టర్ ను పరిశీలించారు. ఫుడ్ కమిటీ సభ్యులుగా ఉన్న విద్యార్థులు క్రమం తప్పకుండా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, అందుకు అనుగుణంగా భోజనాన్ని వండించాలని ఆదేశించారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు యూ డైఎస్ లో నమోదు చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థిని నందిని ఫుట్ బాల్ లో ప్రతిభ చాటి గచ్చిబౌలిలోని నేషనల్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికవడంతో కలెక్టర్ విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు.

## కేటీఆర్, సబితా ఇంద్రరెడ్డి దిష్టి బొమ్మలు దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు

రంగారెడ్డి : మహేశ్వరం నియోజకవర్గం మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి. కేటీఆర్ విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చి అనంతరం మహేశ్వరంలో కేటీఆర్ మరియు స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గార్ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై దహనం చేసి తమ నిరసన వ్యక్తంచేశారు. మహేశ్వరంలో బహిరంగ సభలో బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి.దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై కేటీఆర్ చిల్లర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు, ప్రజల మద్దతుతో నడుస్తున్న రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వాన్ని చూసి కేటీఆర్‌కు ఓర్వలేకపోతున్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటైన విద్య అందించాలి

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూన్30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల



ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలి



### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూన్ 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరి చూడాలని పేర్కొన్నారు. ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం, ఇటీవలి ఫుడ్ సేఫ్టీ అంశం మీద శిక్షణ పొందిన పలువురు అంగన్వాడి టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందించారు. ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేందర్, డిడబ్ల్యూవో వినూత్న, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

### - ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటైన విద్య అందించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

### - ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

నిర్మల్ జూన్30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల





సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్కూటీలను పంపిణీ చేసిన మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు



ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నందు మంగళవారం మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9 మంది దివ్యాంగులకు స్కూటీ లను ద్విచక్ర వాహనాలను రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.

అనంతరం రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కి నాయకులు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మార్కెట్ చైర్మన్ హనుమంతు,మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి రమేష్ నాయుడు, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సేవలకు ఘన సత్కారం

### - ఉద్యోగ విరమణ పొందిన అధికారులను సన్మానించిన జిల్లా ఎస్పీ

ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి:

ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ కుటుంబం కంటే సమాజానికే ఎక్కువ సమయం కేటాయించి సేవలందించే వారు పోలీసులేనని, ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతూ ఆరోగ్యవంతమైన, ఆనందమైన జీవితాన్ని కొనసాగించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు సూచించారు.జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఎస్సై చంద్రశేఖర్, సివిల్ హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య గౌడ్ , ఎ.ఆర్.ఎస్సై రాజశేఖర్ రెడ్డి, ఏ.ఆర్. హెడ్ కానిస్టేబుల్ యల్ల శివా చారి లను జిల్లా ఎస్పీ పూలమాలలు, శాలువలు వేసి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఈ అధికారులు ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో అనేక సందర్భాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించడం పోలీస్ సేవా తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవం, క్రమశిక్షణ, సేవా భావం రాబోయే తరం పోలీసు అధికారులకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

పోలీసు అధికారులు తమ విధులను విజయవంతంగా నిర్వర్తించడంలో వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని అభినందించారు.

ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ యోగ, వ్యాయామం చేయాలని, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ ఆనందంగా జీవించాలని సూచించారు. అలాగే తమ అనుభవాన్ని కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లలకు మార్గదర్శకంగా అందిస్తూ, వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

రిటైర్మెంట్‌తో పోలీస్ శాఖతో అనుబంధం ముగిసిపోదని, శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సతీష్ కుమార్, ఎ.ఆర్. డీఎస్పీ టి.నరేందర్ రావు, ఆర్.ఐ అడ్మిన్ నరేష్, గద్వాల్ టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్, సీసీఎస్ ఎస్సై కృష్ణదేవ, సిబ్బంది, ఉద్యోగవిరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాలలకు రోస్టర్ అన్యాయంపై పోరాటానికి మద్దతు ఇవ్వాలి

**- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కోరిన మాలమహానాడు నాయకులు**



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జూన్ 30

జూలై 12న భద్రాచలంలో నిర్వహించనున్న మాల, మాల ఉపకులాల మహా ర్యాలీ పోస్టర్లను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు ఎమ్మెల్యేను కలిసి, ఎస్సీ వర్గీకరణ అనంతరం అమలవుతున్న రోస్టర్ విధానం వల్ల మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా తమ పోరాటానికి మద్దతు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే, జూలై 12న నిర్వహించే మాల మహా ర్యాలీని విజయవంతం చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌలరాజ్, జిల్లా ఇన్‌చార్జ్ దామల సత్యం, నాయకులు భయ్యన వీరబాబు, వరద సాయికుమార్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ కి సన్మానం

**గిరిజన ప్రాంతంలో ప్రత్యేక వైద్య కేంద్రంలో కేన్సర్ నిర్ధారణ కొరకు చర్యలు చేపడతాం: ఐటీడిఏ పీవో**

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జూన్ 30:

భద్రాచలం పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ ని కలిసి, ప్రతిష్టాత్మకమైనటువంటి "దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు ఆఫీసర్"గా "జాతీయ గౌరవం – గుర్తింపు" పొందిన ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ ని సన్మానించడం జరిగింది . ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా గిరిజన ప్రాంతంలో అమలు పర్చినందుకు ట్రైబల్ వెల్ఫేర్ మ్యూజియం స్థాపించినందుకు, విద్యాశాఖలో, వైద్యశాఖలో వినూత్నమైనటువంటి పథకాలను అమలుపర్చినందుకు, వారికి గుర్తింపు రావడం గర్వకారణం, గిరిజన సంక్షేమం కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన అంధత్వ నివారణ, కేన్సర్ నివారణ శిబిరాలను నిర్వహించుటకు పీవో సహాయ సహకాల వలన 2500 మందికి కంటి ఆపరేషన్లు, 400 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వలన అందరికీ కంటి చూపు మెరుగుపడిందని, వైద్యసేవలు మెరుగుపడినాయని రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డా॥ఎస్.ఎల్.కాంతారావు తెలిపినారు. గిరిజన ప్రాంతంలో వైద్యసదుపాయాలు విస్తృతపర్చుటకు గౌరవనీయ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాలతో సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్, రాష్ట్ర ఐఆర్సిఎస్ కార్యదర్శి ఎ. శ్రీరాములు సూచనలతో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ గారు, అడిషనల్ డైరెక్టర్ డి. వేణుగోపాల్ గారు పాల్వంచలో రెడ్ క్రాస్ సంస్థ భవన నిర్మాణానికి 0.10 జిటిఎస్ స్థలాన్ని కేటాయించినారని, ఈ స్థలం నందు ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అందులో ఉచిత కేన్సర్ నిర్ధారణ, ఉచిత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని దీని వలన గిరిజన సంక్షేమం, వైద్య సదుపాయలు విస్తృతపరచాలని కోరగా, ప్రాజెక్టు ఆఫీసర్ వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని తెలపగా,



రెడ్ క్రాస్ తరపున డా॥ఎస్.ఎల్.కాంతారావు ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో డా॥ఎస్.ఎల్.కాంతారావు జిల్లా కో–ఆర్డినేటర్, డా॥యం. వి. కోటిరెడ్డి, డా॥భాను ప్రసాద్, రొటేరియన్ కె. అబ్రహాం, లయన్ గాదె మాధవరెడ్డి లయన్ చావా లక్ష్మీనారాయణ, డా॥పి.రాజశేఖర్, లయన్ వై. సూర్యనారాయణ, రొటేరియన్ జి, రాజారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నందిపాటి భద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ

పాలేరు జూన్ 30( ప్రజా కలం న్యూస్) కుసుమంచి మండలం పరిధిలోని మంగళవారం చౌటపల్లి గ్రామంలో మరణించిన భద్రయ్య, కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలుగ్రామస్తులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన వార్డు సభ్యుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం



మరిపెడ (ప్రజా కలం)న్యూస్ జూన్ 30

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామపంచాయతీ లోని రైతు వేదికలో రెండవ రోజు కూడా గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని ట్రైనర్లు అన్నారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్ చట్టాలపై గ్రామాభివృద్ధి పరిపాలన నిధులకు సంబంధించిన వివిధ రకాల అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించామన్నారు కొన్ని కొన్ని గ్రామాలలో చూసుకుంటే కనీస అవగాహన లేని వారు కూడా వార్డు మెంబర్లుగా పనిచేస్తున్నారు అన్నారు అలాంటి వారి కోసమే ఇలాంటి శిక్షణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నాం అన్నారు ఈకార్యక్రమం లో ట్రైనర్లు రామోజీ,సుమన్,దేవయ్య మరియు పంచాయతీ కార్యదర్శులు మంజుల, గోపీచంద్,లక్ష్మణ్ ఆపరేటర్ ఉమ మరియు ఆయా వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పోలియో మహమ్మారి నిర్మూలనే లక్ష్యం

**మరిపెడ మండల వైద్యాధికారి గుగులోత్ రవి**

**మూడవ రోజుకి వంద శాతం ముగిసిన పల్స్ పోలియో**

**అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాధికారి పరిశీలన**

**తప్పిపోయిన (మిస్ అయిన) పిల్లలను గుర్తించి చుక్కలు వేసిన సిబ్బంది**

**మూడు రోజుల పాటు బస్టాండ్‌లోనూ పోలియో చుక్కల పంపిణీ**

మరిపెడ (ప్రజా కలం) న్యూస్ జూన్ 30

మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రానజ) పరిధిలో మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది. అని మరిపెడ మండల వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి



అన్నారు మా పర్యవేక్షణలో వైద్య సిబ్బంది మూడవ రోజు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఐదేళ్లలోపు పిల్లలందరికీ 100 శాతం పోలియో చుక్కలు వేయడం జరిగింది. అన్నారు ఇబ్బంది మొత్తం కలిసికట్టుగా లక్ష్యాన్ని అధిగమించారు అన్నారు అదేవిధంగా స్వయంగా నేనే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లలకు పోలియో చుక్కలు వేశారా లేదా అనే అంశాన్ని క్రాస్ చెక్ (పరిశీలన) చేశాను ఈ పరిశీలనలో ఎక్కడైనా చుక్కలు వేయించుకోని (మిస్ అయిన) పిల్లలు ఉంటే, వారిని గుర్తించి అక్కడికక్కడే పోలియో చుక్కలు వేశారు. ప్రయాణాల్లో ఉన్న పిల్లల కోసం గత మూడు రోజులుగా స్థానిక బస్టాండ్‌లో కూడా ప్రత్యేకంగా పల్స్ పోలియో కేంద్రాన్ని నిర్వహించి చుక్కలు వేసాము అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వైద్యులు డాక్టర్ స్వామి, డాక్టర్ వెంకన్న, డాక్టర్ పూజిత, డాక్టర్ కిరణ్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, సూపర్‌వైజర్లు ఆచార్యులు, లలిత కుమారి, వెంకన్న, మాధవి అలాగే హెల్త్ అసిస్టెంట్లు దావకాన సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**- సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ఖమ్మం, జూన్ 30( ప్రజా కలం న్యూస్ )

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**యూరియా యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా యూరియా సరఫరా**

జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు 18832.34 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోగా, పాత నిల్వలను కలుపుకొని 24903.7 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 6071.13 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం అయినట్లు కలెక్టర్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం లోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా రైతుల మొబైల్ ఫోన్ లో పరిశీలన చేసి యాప్ వల్ల సమకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, యూరియ లభ్యత పై రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని, ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు. జిల్లాతో పాటు మీ మండలంలో ఉన్న స్టాక్ వివరాలు కూడా యాప్ లో తెలుస్తాయని తెలిపారు. అదేవిధంగా యూరియా కు ప్రత్యామ్నాయ గా నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతులను నానో యూరియా కొనాలని డీలర్లు,బలవంతం చేయవద్దని,వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు పంటల అవసరంమేరకు మాత్రమే మోతాదుకు మించకుండా ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించే విధంగా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, చింతకాని మండల తహసీల్దార్ కిలారి బాబ్జీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ, అంబేద్కర్ లలో మంచిని గ్రహించాలి

**- ఖమ్మం విద్యుత్ శాఖ ఆఫీసు ప్రాంగణంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ**

**- విద్యుత్ శాఖ లో ప్రమాదాలు నివారించుదాం : వరంగల్ డైరెక్టర్ వంగూరి మోహనరావు**

ఖమ్మం జూన్ 30( ప్రజా కలం న్యూస్)ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆఫీసు ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల చెడిపోయిన కారణంగా వాటి స్థానములు కొత్తవి ప్రతిష్టాపన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి డిపార్ట్మెంట్లో ఉన్న ఇంజనీర్లు , యూనియన్లు , ఇంజనీరింగ్ అసోసియేషన్లు , వెల్ఫేర్ అసోసియేషన్ లు అందరూ కాంట్రిబ్యూషన్ ద్వారా నూతన విగ్రహాలను ప్రతిష్టించారు. సూపరిండెంట్ ఇంజనీర్ ఈ శ్రీనివాస చారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగినది . ఖమ్మం జిల్లాలో వినియోగదారులకు అవసరమయ్యే విధంగా ప్రణాళికలు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మించి మారుతున్న పరిస్థితులకు , వాతావరణాలకు అనుగుణంగా ఎంతో ఎన్నో మార్పులకు , ప్రభుత్వ , అధికారుల , విద్యుత్ శాఖ అధికారులు , సిబ్బందితో ముందుకు వెళుతున్నట్టు తెలియజేసినారు . డైరెక్టర్ (ప్రాజెక్ట్ ) వంగూరి మోహన్



అంబేద్కర్ , గాంధీ విగ్రహాలను ఆవిష్కరించి పూల మాల తో నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో ఉన్న లోపాలు మెరుగుపరచుకొని ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని కచ్చితంగా భద్రత నియమాలను పాటించాలని కోరారు . సమావేశంలో అందరి చేత ప్రమాదాల నివారణకు , సంస్థ రక్షణకు ప్రతిజ్ఞ చేయించినారు . ఈ కార్యక్రమంలో యూనియన్ ఇంజనీర్లు బాబురావు , నాగేశ్వరరావు , బద్రుపవార్ , రాములు , రామారావు , శ్రీనివాసరావు , టి.వెంకటేశ్వర్లు , సివిల్ వెంకటేశ్వర్లు రమేష్ కుమార్ , అకౌంట్ అధికారి శ్రీధర్ , పి ఓ తిరుపతి వీరితో పాటు యూనియన్ లీడర్లు 1104 శేషగిరిరావు , 327 సత్యనారాయణ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం యు శ్రీనివాసరావు , సిఐటియు . ఎం ప్రసాద్ , తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ వై వి ఆనంద్ కుమార్ , తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రమేష్ కుమార్ , తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు నాగమల్లేశ్వరరావు , తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ విక్రమ్ , తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ బివిఎస్ మూర్తి , విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జి కృపాకర్ , తెలంగాణ ఎలక్ట్రిసిటీ బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సిహెచ్ నాగార్జున , తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏ కిరణ్ చక్రవర్తి , తెలంగాణ స్టేట్ ఎస్టీ విద్యుత్తు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోక్యా నాయక్ , తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఓసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జి నరేష్ కుమార్ , తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జయశంకర్ , తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ముస్లిం మైనారిటీ అసోసియేషన్ ఖాదర్ బాబా , తెలంగాణ ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ బి వీరభద్రం తదితరులు హాజరై ప్రసంగించారు .

## గద్వాల్ ఆర్టీసీ డిపో సమస్యలపై డిపో మేనేజర్‌తో ఆలంపూర్ శాసనసభ్యులు విజయుడు సమీక్ష



ప్రజా కలం న్యూస్ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల్ ఆర్టీసీ డిపోలో ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు డిపో మేనేజర్ శ్రీధర్‌తో సమావేశమై డిపో నిర్వహణ, ప్రయాణికులకు అందుతున్న రవాణా సేవలు, బస్సుల నిర్వహణ, స్థానిక సమస్యలు మరియు వాటి పరిష్కారంపై సమగ్రంగా చర్చించారు. ఆలంపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, సకాలంలో రవాణా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్ శ్రీధర్‌కు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యమని, రవాణా సేవల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలకు తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు.

## బొడ్రాయి పండుగకు రాకపోయినా 10 వేల విరాళం అందించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మరిపెడ (ప్రజా కలం) న్యూస్ జూన్ 30

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నేతవాత్ పర్కజాల్ తండాలో ఇటీవల జరిగిన బొడ్రాయి పండుగ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక విరాళాన్ని అందించారు అని తండా సర్పంచ్ బానోత్ కొండయ్య అన్నారు బొడ్రాయి పండుగకు హాజరుకావాలని పండుగ నిర్వహణకు సహకారం అందించాలని నేతవాత్ పర్కజాల్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ కొండయ్య నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ లాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ బానోత్ సైదులు నాయక్ ఆధ్వర్యంలో తండా నాయకులు ఇటీవల మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి ఆహ్వానించాం అన్నారు కొన్ని అనివార్య కారణాల వల్ల ఆమె పండుగ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని అయినప్పటికీ తండావాసుల విజ్ఞప్తిని గుర్తుంచుకుని మాజీ మంత్రి జూన్ 30 మంగళవారం రోజున భూక్య రామ్మూర్తి నాయక్ ద్వారా రూ.10 వేల నగదు సహాయాన్ని పంపించారు అన్నారు ఈ మొత్తాన్ని తండావాసుల సమక్షంలో నాకు అందజేశారు అన్నారు ఈ సందర్భంగా తండా నాయకులు,గ్రామస్థులు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ లాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ బానోత్ సైదులు నాయక్, పరమేష్, బానోత్ కుమార్, గౌస్, బాలు, తులసి, చిన్ని, అచ్చమ్మ, కాంతి, ఆమని, శైలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.**

నిర్మల్ జూన్ 30(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం హైదరాబాదు నుంచి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నుంచి అన్ని రైతు వేదికల ద్వారా కలెక్టర్లు, రైతులు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

వ్యవసాయాన్ని పండుగలా చేశామని చెప్పారు. ఈ విడతతో 36 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. 26 వేల 670 కోట్లు రుణమాఫీతో పాటు 30 వేల కోట్లు ఉచిత విద్యుత్ కొరకు ఖర్చు చేశామని తెలిపారు.
రైతు బీమా కింద 3500 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. సగటున నెలకు రైతుల సంక్షేమం కొరకు 6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా కూడా, రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

ఈసారి వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు.

నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల గ్రామంలోని రైతు వేదిక నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవదాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసిల్దార్ ప్రభాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుప్రియ, రైతులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'రియల్' పాఠాలు నేర్పుతారు!

### – రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మార్గదర్శిగా 'రియల్ వర్సిటీ'

### –గ్రోత్ కాంక్లేవ్–2026 వేదికగా వందల మందికి అవగాహన






**హైదరాబాద్, జూన్ 30 (ప్రజాకలం) :** రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటే.. భూమి అమ్మడం, కొనడమేనా? అంటే సాధారణ వ్యక్తులు అంతే అంటారు. కొందరు బ్రోకరిజం అంటారు. ఇంకొందరు కమీషన్ బిజినెస్ అంటారు. కానీ, రియల్ ఎస్టేట్ అంటే మధ్య తరగతి కలను సాకారం చేసే వేదిక అని రియల్టర్లలో ఆత్మవిశ్వాసం నింపుతోంది 'రియల్ వర్సిటీ'. ఉరుకుందు శెట్టి అనే యువకుడు స్థాపించిన ఈ వినూత్న రియల్ ఎస్టేట్ విద్యాసంస్థ.. వందల మందికి మార్గదర్శిగా నిలుస్తోంది. దీన్ని స్థాపించి జూన్ 30తో ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో జరిగిన గ్రోత్ కాంక్లేవ్–2026 అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు, మార్గదర్శకులు, మెంటార్లు, మోటివేషనల్ స్పీకర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ రంగంలో సవాళ్లను తెలియజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైడ్రా చీఫ్ రంగనాథ్.. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న సవాళ్లను, ప్రభుత్వ నిబంధనలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రముఖ ఉపన్యాసకుడు పెరుమాళ్లు అందించిన సమాచారం భవిష్యత్తుకు పూల బాటలు వేసింది. ఇక, రియల్ ఎస్టేట్ రంగంలో సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి,

ఈ రంగాన్ని ఎంతలా ప్రేమించాలి, ఈ రంగం సబ్జెక్టు లోతు ఎంత? అన్న అంశాలను ప్రస్తావించి, ఎంతో మందికి అవగాహన కల్పించారు. ఉరుకుందు శెట్టి ప్రారంభోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఆధ్యాత్మిక యోగా గురువు జగన్ గురువు.. ఆధ్యాత్మిక అంశాలను ప్రస్తావిస్తూనే, ఓర్పు, నేర్పు ఎంతటి విజయాన్ని అందిస్తాయో వివరించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో ఎంత ఓర్పు ఉండాలన్నదీ తెలియజేశారు. మోటివేషనల్ స్పీకర్ సునీల్ కుమార్ గాజుల, రియల్ విజన్ గ్రూప్ అధినేత జక్క బాలాజీ, మాజీ ప్రభుత్వ ఉద్యోగి (అడిషనల్ డైరెక్టర్) రమేశ్ బాబు, ఎడిట్ పాయింట్ రమేశ్, రియల్ వర్సిటీ చీఫ్ మెంటార్ రాఘవేంద్ర రావు దేశాయ్ తదితరులు రియల్ ఎస్టేట్ రంగంలోని తెలియని అనేక అంశాలను ప్రస్తావించారు. ఒక చానల్ పార్ట్‌నర్‌కు ఉండాల్సిన లక్షణాలు, విషయ పరిజ్ఞానం, సంస్థపై నమ్మకం, సంస్థ ఎదిగేందుకు చేయాల్సిన పనులు.. అదే సమయంలో చానల్ పార్ట్‌నర్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోర్ టీం మెంబర్స్ సీఎఫ్ఓ మన్నె సురేశ్ కుమార్, ప్రవీణ్ కుమార్ మంగలి, దుర్గ మల్లేశ్, సాయి విజేందర్, నరేందర్, రంజిత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.







## గుర్రంగూడ ఫారెస్ట్ లో కేబీఆర్ తరహా ఎకో పార్క్..



హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు తరహాలో అధునాతన ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న అటవీ భూమిలో 142 ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబరు లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్‌లు, వాక్‌వేలు, ధ్యానమందిరాలతో పాటు సందర్శకుల రద్దీ నియంత్రణకు ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యాధునిక హంగులతో సరికొత్త ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ ముమ్మర కార్యాచరణ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును తలపించేలా.. అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో ఈ పార్కును రూపొందించనున్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదిత నివేదికను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ఎకో పార్కు పనులను ఈ ఏడాది డిసెంబరులోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం 424 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. అందులో 142 ఎకరాలను ప్రత్యేకంగా ఎకో పార్కు అభివృద్ధి కోసం కేటాయించారు. ఈ పార్కులో సందర్శకుల కోసం సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన వాక్‌వేలు, ప్రశాంత వాతావరణంలో యోగా చేసుకునేందుకు ధ్యాన మందిరాలను నిర్మించనున్నారు. అలాగే వివిధ అధికారిక, అనధికారిక సమావేశాల నిర్వహణకు వేదికలు, సందర్శకులు కూర్చుని మాట్లాడుకునేందుకు వీలుగా పచ్చిక బయళ్లలో ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా తట్టుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఒకేసారి వస్తే ప్రవేశ ద్వారాల వద్ద రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పార్కుకు ఐదు వేర్వేరు చోట్ల ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నారు. వారాంతాల్లో కుటుంబాలతో గడిపేవారి కోసం ప్రత్యేక యాక్టివిటీ జోన్లు, పిల్లల వినోదం కోసం ప్లేజోన్లను కూడా సిద్ధం చేస్తున్నారు.గతంలో గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ భూములంటూ ఆక్రమించుకుని కోర్టులను ఆశ్రయించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి కస్నా నాయక్‌లు లీగల్ టీమ్‌తో కలిసి పక్కా ఆధారాలు సేకరించారు. ప్రైవేటు వ్యక్తులు కోర్టులో సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీవని నిరూపించడంలో వారు విజయం సాధించారు. దీంతో ఆ భూములు పూర్తిగా అటవీశాఖవేనని స్పష్టం చేస్తూ గతేడాది సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు అనంతరం అటవీశాఖ ఆక్రమణలను తొలగించి రికార్డులను సరిచేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి దక్కించుకున్న 116 ఎకరాల భూమిని స్పష్టంగా గుర్తిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణల నుంచి విముక్తి పొందిన ఈ అటవీ భూమి ఇప్పుడు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన హరితవనంగా మారబోతోంది.

## డ్రైవింగ్ లైసెన్స్ ఇక కష్టం

హైదరాబాద్ : వాహనదారులకు అలర్ట్.. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత సులువు కాదు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, వాహనదారులలో ట్రాఫిక్ నియమాలపై పూర్తి అవగాహన పెంచడానికి రవాణాశాఖ సరికొత్త నిబంధనలను తీసుకువస్తోంది. గతంలో లాగా కేవలం వెహికల్ నడపడం వస్తే సరిపోదు. ఇకనుంచి ఆర్టీఏ నిబంధనల ప్రకారం అగ్నిపరీక్షలు పాస్ కావాల్సిందే. ఇందుకోసం రవాణాశాఖ సరికొత్త విధివిధానాలను రూపొందిస్తోంది. ఈ కొత్త విధానం ప్రకారం లైసెన్స్ ప్రక్రియ ఎలా ఉండబోతుందో ఇక్కడ తెలుసుకుందాం.

కొత్త పరీక్షల విధానం:

మొదటి దశ : ఎల్ఎల్ఆర్ కోసం స్లాట్ బుక్ చేసుకుని, ఆన్‌లైన్ పరీక్షలో పాస్ కావాలి. ఇందులో ట్రాఫిక్ నియమాలపై కనీస అవగాహనను పరీక్షిస్తారు.

2 ఆన్‌లైన్ టెస్టులు: ఎల్ఎల్ఆర్ వచ్చిన తర్వాత, తుది డ్రైవింగ్ టెస్ట్‌కు వెళ్లే లోపు అభ్యర్థులు మరో రెండు ఆన్‌లైన్ పరీక్షలు అటెండ్ అయ్యి, పాస్ కావాల్సి ఉంటుంది. వీటిని అభ్యర్థులు తమ ఇంటి నుంచే రాసుకోవచ్చు

డ్రైవింగ్ టెస్ట్: పైన పేర్కొన్న ఆన్‌లైన్ పరీక్షల్లో పాసైన వారికి మాత్రమే టెస్ట్ ట్రాక్‌పై వాహనం నడిపేందుకు అనుమతి ఇస్తారు. ఏ దశలో ఫెయిలైనా మళ్లీ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

అవగాహన వీడియోలు ఀ మార్పులు:

వీడియోల వీక్షణ: ఆన్‌లైన్ టెస్టులు రాయడానికి ముందు అభ్యర్థులు రహదారి భద్రత, డ్రైవింగ్ మెళకువలు, అతివేగం వల్ల జరిగే నష్టాలపై రవాణాశాఖ రూపొందించిన 2 నుండి 3 గంటల నిడివి గల వీడియోలను చూడాల్సి ఉంటుంది.

వాహన్ సారథి పోర్టల్: ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా త్వరలోనే 'వాహన్ సారథి' అనే పోర్టల్‌లో మార్పులు చేయనున్నారు.

దళారుల నియంత్రణకు బయోమెట్రిక్: ఇకనుంచి ఏజెంట్ ల జోక్యాన్ని పూర్తిగా తగ్గించే విధంగా చర్యలు చేపట్టనున్నారు అధికారులు. టెస్ట్ ట్రాక్‌ల వద్ద ఏజెంట్లు, దళారుల జోక్యాన్ని అరికట్టడానికి, పరీక్షలు నిర్వహించకుండానే లైసెన్సులు ఇస్తున్నారనే ఆరోపణలకు చెక్ పెట్టడానికి రవాణాశాఖ బయోమెట్రిక్ (వేలిముద్రల) విధానాన్ని తప్పనిసరి చేయనుంది. మరీ ముఖ్యంగా 25 నుండి 30 ఏళ్ల లోపు యువత అజాగ్రత్త, ర్యాష్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా కాపాడటమే ఈ కొత్త విధానం యొక్క ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెపుతున్నారు. మరి, ఈ కొత్త నిబంధనలు ఎప్పటినుంచి అమలులోకి రానున్నాయి అనేది చూడాలి.

## సగానికి తగ్గిన దిగుమతులు

ముంబై : భారత విదేశీ మారక నిల్వలను కాపాడుకునేందుకు, చమురు సంక్షోభం వేళ దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటించాలని దేశ ప్రజలకు సూచించారు. మే 10, 2026 రోజున తెలంగాణలో పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ వేదికగా ఏడాది పాటు విచక్షణారహితంగా బంగారం కొనుగోలు చేయవద్దని పిలుపునిచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వం ఇంపోర్ట్ డ్యూటీని 15 శాతం వరకు పెంచింది. ఈ చర్యల వల్ల దేశీయ మార్కెట్లో బంగారం, వెండి డిమాండ్ తగ్గింది. అయితే మరి ప్రధాని మోదీ పిలుపు తర్వాత దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు తగ్గాయి. ప్రధాని మోదీ పిలుపు తర్వాత దేశీయ మార్కెట్లో బంగారం కొనుగోళ్లు భారీగానే తగ్గాయి. ప్రభుత్వం దిగుమతి సుంకాలు పెంచడం సైతం అందుకు ఓ కారణమైంది. దీంతో మే 10వ తేదీ నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే 10 గ్రాముల బంగారం ధర రూ.13000 పైన దిగివచ్చింది. అలాగే కిలో వెండి రేటు చూస్తే రూ.46 వేల వరకు తగ్గింది. మే 10, 2026 రోజున ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన రోజున 24 క్యారెట్ల బంగారం రేటు రూ.1,53,150 వద్ద ఉంది. అలాగే కిలో వెండి రేటు చూస్తే రూ.2,62,350 వద్ద ఉంది. ఇక జూన్ 28, 2026 ఆదివారం రోజున ఇండియన్ బులియన్ అసోసియేషన్ డేటా చూసుకుంటే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,873కు దిగివచ్చింది. అలాగే కిలో వెండి రేటు రూ.2,16,541 వద్ద ట్రేడవుతోంది. దీని ప్రకారం చూస్తే 10 గ్రాముల బంగారం రేటు రూ.13,267, వెండి రూ.45,809 వరకు తగ్గాయి.ప్రభుత్వం దిగిమతి సుంకాల పెంపు, ప్రధాని మోదీ విజ్ఞప్తితో దేశంలోకి జరిగే బంగారం దిగుమతులు భారీగా పడిపోయాయి. సాధారణంగా నెలకు 75–100 టన్నులుగా ఉండే దిగుమతులు అది 25–30 టన్నులకు పరిమితయ్యాయి. మే నెలలో గోల్డ్ ఇంపోర్ట్స్ 39 శాతం తగ్గి 3.42 బిలియన్ డాలర్లకు పరిమితయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు దేశంలోని ప్రధాన జువెలరీ హబ్‌లైన్ జైపూర్, పాట్నా వంటి నగరాల్లో బంగారం వ్యాపారం 50 శాతం నుంచి 80 శాతం మేర మందగించినట్లు సమాచారం.

## ముషీరాబాద్ ఎమ్మెల్యేకు కవిత మాస్ వార్నింగ్

### పాతవాళ్ళు పని చేయరు

# కొత్తవారికి అవకాశం ఇవ్వరా?




హైదరాబాద్, జూన్ 30 (ప్రజాకలం) : కొత్తగా ఆవిర్భవించిన తమ పార్టీని చూసి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు భయపడుతున్నారని టీఆర్ఎస్ అధినేత్రి కవిత ధ్వజమెత్తారు. పాతవాళ్ళు నియోజకవర్గాల్లో ఎలాంటి పనులు చేయరని, మరి అలాంటప్పుడు కొత్తవారికి అవకాశం ఇవ్వరా అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కవిత మాట్లాడుతూ.. ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేతో పాటు, బీజేపీ మాజీ ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గంలో కొందరు రాజకీయ నాయకులు దాదాగిరి, గుండాగిరి చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీకి సంబంధించిన జెండాలు, పోస్టర్లు అతికిస్తే ఎమ్మెల్యే, ఆయన కుమారుడు వాటిని తొలగించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి బెదిరింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని, గుండాగిరి చేస్తే తిరగబడతామని కవిత మాస్ వార్నింగ్ ఇచ్చారు. చేతనైతే రాజకీయాల్లో, ప్రజాసేవలో పోటీ పడాలని, నియోజకవర్గ అభివృద్ధిలో పోటీ ఉండాలని హితవు పలికారు. ఇన్నేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి ముషీరాబాద్ నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో, ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకువచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకూ ధరలు పెరిగాయి తప్ప పేద ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పులు రాలేదని కవిత స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 14 ఏళ్లు గడుస్తున్నా, నాటి ఉద్యమ ఆశయాలు మాత్రం ఇప్పటికీ నెరవేరలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక తెలంగాణ సాధ్యమైందా? నాడు ప్రాణాలర్పించిన ఉద్యమ కారులకు ఈ రాష్ట్రంలో న్యాయం జరిగిందా? అని ప్రశ్నించారు. మధ్యతరగతి, పేదలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో నేటికీ ఎలాంటి మార్పు రాలేదని, ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదని ఆమె ప్రజలను మేల్కొలిపారు. అందుకే ఈ అన్యాయాలపై పోరాడేందుకు, ప్రజలకు అండగా నిలిచేందుకు ఒక ఆడబిడ్డగా తాను కొత్త పార్టీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తాము అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యంతో పాటు ప్రజల సంక్షేమానికి సంబంధించి 'పాంచజన్యం' లోని ఐదు కీలక అంశాలను కచ్చితంగా అమలు చేస్తామని కవిత ప్రజలకు హామీ ఇచ్చారు.

# ఆశీర్వాద సభలతో రైతులు దృష్టి మళ్లింపు

### సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ధ్వజం

### భరోసా నిధులను ఎగ్గొట్టి రైతు ద్రోహిగా మిగిలారని వ్యాఖ్య



హైదరాబాద్, జూన్ 30 (ప్రజాకలం) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. రైతాంగానికి రూ. 30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగనామం పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చరిత్రలో రైతు ద్రోహిగా మిగిలిపోతారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన యూరియా కొరత, రైతుల కష్టాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇప్పుడు ఆశీర్వాద సభల పేరిట డ్రామాలు ఆడుతోందని ఆయన విమర్శించారు. కేవలం ఒక కంప్యూటర్ బటన్ నొక్కితే సరిపోయే నామమాత్రపు నిధుల విడుదలకు ఆర్భాటంగా పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ముదనష్టపు పాలనగా అభివర్ణించిన కేటీఆర్.. వ్యవసాయాన్ని దండగలా మార్చి రైతుల గొంతు కోస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రతి ఎకరానికి ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని గ్యారెంటీలతో గారడీ చేసి, అధికారంలోకి వచ్చాక ఒకటి, అర ఎకరానికి మాత్రమే అరకొరగా నిధులు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసాను ఎగ్గొట్టి, దాదాపు 70 లక్షల మంది రైతుల ఉసురు పోసుకుంటు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రూ. 50 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన రెండు లక్షల రుణమాఫీని కనీసం పావలా వంతు కూడా చేయకుండా అన్నదాతలను మోసం చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చేస్తున్న ఢిల్లీ టూర్లకు, పనికిరాని పబ్లిక్ మీటింగ్ లకు పెడుతున్న కోట్లాది రూపాయల ఖర్చును ఆదా చేసి ఉంటే.. రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని చురకలంటించారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా దొరకక అల్లాడుతున్నారని, మొన్నటి పంట కొనుగోళ్ల సంక్షోభం, ఇప్పుడు యూరియా కష్టాలు, మరోవైపు వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉంటే సీఎం సంబరాలు చేసుకోవడంపై రైతులు అసహ్యించుకుంటు న్నారని కేటీఆర్ అన్నారు. కేంద్రం ఎంత కొంటే మేం అంతే కొంటామని చెబుతూ, పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకోవడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం పండగలా సాగిందని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ 11 సార్లు, సుమారు రూ. 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ రైతు బాంధవుడిగా నిలిచిపోతారని, కానీ రైతులకు వెన్నుపోటు పొడిచిన రేవంత్ రెడ్డి మాత్రం రైతు ద్రోహిగానే మిగిలిపోతారని, రేవంత్ రెడ్డి చేసిన ఈ పాపం నిరంతరం శాపంలా వెంటాడుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: నిర్మలా జగ్గారెడ్డి.

### రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

### సంగారెడ్డి జిల్లాలో 2,42,753 మంది రైతులకు లబ్ధి- రూ.125.83 కోట్ల ఆర్థిక సహాయం విడుదల

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' వానాకాలం--2026 వాయిదా తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు హైదరాబాద్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి లోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంగారెడ్డి టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ విడతలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కలిగిన 2,42,753 మంది అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రూ. 125.83 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు మొదలవుతున్న తరుణంలో రైతులకు పెట్టుబడి సాయం అందించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఈ నిధులు జిల్లాలోని రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

పారదర్శకంగా నిధుల జమ: జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అర్హులైన 2.42 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయని తెలిపారు.



అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గజ్వేల్ మున్సిపల్‌లో ఓటర్ సవరణ ప్రక్రియపై ప్రజల్లో సందిగ్ధత

### - మరింత అవగాహన కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి




గజ్వేల్:30 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ సవరణ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా సమాచారాన్ని అందిస్తున్నారు. అయితే, ఈ కార్యక్రమంపై ప్రజల్లో ఇంకా అనేక సందేహాలు కొనసాగుతున్నాయి. ఒకే అంశంపై బీఎల్ఓలకు పలుమార్లు ప్రశ్నలు ఎదురవుతుండటంతో వాటికి సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. మరోవైపు, ఓటర్ సవరణకు సంబంధించిన మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్న బీఎల్ఓలు తరచూ యాప్ అప్‌డేట్‌ల కారణంగా సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఓటర్ సవరణ ప్రక్రియకు సంబంధించి భిన్నమైన సమాచారం ప్రచారంలో ఉండటంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారం అధికారికమా, వాస్తవమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఏ సమాచారాన్ని విశ్వసించాలో తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఓటర్ సవరణ ఫారాలను నింపే విషయంలో చదువుకున్న వారిలోనూ సందిగ్ధత కనిపిస్తోంది. ఏ అవసరానికి ఏ ఫారం ఉపయోగించాలి? ఏ ఫారం నింపితే ఎలాంటి మార్పు జరుగుతుంది? వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యావంతులే ఇలాంటి సందేహాలతో ఉంటే, నిరక్షరాస్యులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ నాయకులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్న నేపథ్యంలో, బీఎల్ఓలు ఫారాలను ప్రజలకు అందజేసి స్వయంగా నింపాలని సూచిస్తున్నారు. అయితే, ఫారాలను ఎలా నింపాలి, ఏ వివరాలు నమోదు చేయాలి అనే విషయాల్లో స్పష్టమైన అవగాహన లేక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ సవరణ ప్రక్రియపై గ్రామాలు,వార్డుల స్థాయిలో మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలకు చేరవేయడంతో పాటు ఫారాలను నింపే విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందిస్తే అపోహలు తొలగి ప్రక్రియ సజావుగా సాగుతుందని అభిప్రాయపడుతున్నారు.



భారత ఎన్నికల సంఘం

ఓటరు 2002 ఓటరు లిస్టు లో ఉండి 2025 ఓటరు లిస్టు ఉంటే ఈ విధంగా ఫారం నింపాలి (SELF)

2002 ఓటరు లిస్టు లో ఉన్నవిధంగా పేరు వ్రాయాలి

AP352410168216

2002 ఓటరు లిస్టు లో ఉన్నవిధంగా తండ్రి/భర్త పేరు వ్రాయాలి

స్వంతం/స్వయం/Self

జిల్లా పేరు వ్రాయాలి

రాష్ట్రం పేరు వ్రాయాలి

అసెంబ్లీ నియోజక వర్గం పేరు వ్రాయాలి

| | | |
|---|---|---|
| 241 | 75 | 52 |

0 1 0 1 1 9 8 2

1234 1234 1234

9898443320

తండ్రి పేరు

ZXM1231234

తల్లి పేరు

ZXM1231234

భర్త / భార్య పేరు

ZXM1231234

## చిన్నకోడూరు పీహెచ్‌సీపై జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవల మెరుగుదలకు ఆదేశాలు

### సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట:30 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి) చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కే. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించి వివరాలను ధృవీకరించారు. మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌వో-సూపర్వైజర్‌లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలపగా,జిల్లా కలెక్టర్ వారికి వీడియో కాల్ చేసి నిజనిర్ధారణ చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వారు వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ముందుగా పీహెచ్‌సీకి వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి, అనంతరం ఫీల్డ్‌కు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫీల్డ్ పర్యటన వివరాలను కూడా అటెండెన్స్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మెడికల్ ఆఫీసర్‌ను హెచ్చరించారు. సమయపాలన పాటించని అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు నూటికి నూరు శాతం అందించాలి.

### -ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### - వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆన్‌లైన్ సమీక్ష



సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 30:( ప్రజా కలం ): జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం అందేలా సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఆన్‌లైన్ జూమ్ సమావేశం నిర్వహించి ఆరోగ్య సేవల అమలుపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరై ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం, మరుగుదొడ్ల నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచి రోగులకు అనుకూలమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు, ఇతర మౌలిక వసతులను వెంటనే గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఆదర్శవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ ఆన్‌లైన్ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలిత దేవి , జిల్లా స్థాయి ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీస్ ల రోప్ ఆపరేషన్, రోడ్డు, పుట్ పత్ ల ఆక్రమణలకు చెక్



కంటోన్మెంట్ :జూన్ 30:ప్రజాకలం ప్రతినిధి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆల్వాల్ కనాజిగూడ ప్రాంతంలో రోప్ (=హ్రాజు) ఆపరేషన్‌లో భాగంగా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఆదేశాలు, ట్రాఫిక్-1 డీసీపీ రాహుల్ రెడ్డి సూచనల మేరకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ డ్రైవ్ చేపట్టారు. తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఆల్వాల్ సర్కిల్-2 డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్, టౌన్ ప్లానింగ్ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి, ఆల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హరిలాల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, జీహెచ్ఎంసీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనాజిగూడ ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్ లపై చాలా కాలంగా ఉన్న అక్రమ ఆక్రమణలను, వాహనదారులకు,పాదచారులకు ఇబ్బందిగా మారిన అనధికార నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులు,వీధి వ్యాపారుల ను హెచ్చరించారు. అక్రమ ఆక్రమణల వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు పాదచారుల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. రహదారులను ఆక్రమణల రహితంగా మార్చేందుకు, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు స్థానిక నివాసితులు, వ్యాపారులు పోలీస్, జీహెచ్ఎంసీ విభాగాలకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## 55 మంది భక్తులతో మహా సైకిల్ యాత్రను ప్రారంభించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్

రాజేంద్రనగర్ జూన్,30 (ప్రజా కలం)

సువర్ణభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వినయ్ గురు స్వామి వసంత్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతి ఏటా బాన్సువాడ నుండి కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి వందల మంది మహాపాదయాత్ర నిర్వహిస్తూ ఉంటారు ఈ ఏటా 26 న బాన్సువాడ నుండి తిరుమల తిరుపతి



లోని వైకుంఠ వాసుని తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడాని కి 55 మంది భక్తులతో మహా సైకిల్ యాత్రను ప్రారంభించడం జరిగింది. ఈరోజు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్ గారు వారి మిత్రులు రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ నుండి తిరుపతికి వెళుతుండగా మార్గం మధ్యలో కాటేదాన్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కు సంబంధించిన నర్సిరెడ్డి స్వామి మల్లేష్ స్వామి అశోక్ కుమార్ స్వామి రమేష్ రెడ్డి స్వామి బాబురావు స్వామి సత్య రెడ్డి స్వామిశివకుమార్ స్వామి కట్ట స్వామి వీరన్న స్వామి కొంతమంది సైకిల్ యాత్రి భక్తులను కలిసి వారికి తేనీటి పానీయములు అందించి అభినందించడం జరిగింది.

## చేనేత సహకార సంఘం ఎన్నికలకు షెడ్యూల్ విడుదల.

గజ్వేల్:30 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ చేనేత సహకార సంఘంలో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ సోమవారం విడుదల చేశారు.సంఘం ఎన్నికల అధికారి చిన్నాల గౌతమ్ వివరాలు




తెలిపారు.జిల్లా చేనేత జోలి శాఖ ఏడిఓ టీ.అంజయ్యతో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫారం నంబర్ ఒకటి. విడుదల చేశారు గజ్వేల్ సంఘంలో 236 మంది ఓటర్లు ఉన్నారని జూలై 2నుంచి 4 తారీకు వరకు నామినేషన్ల స్వీకరణ ఐదవ తేదీన పరిశీలన ఆరవ తేదీన నామినేషన్ల ఉపసంహారణ ఉంటుందని అన్నారు.పోలింగ్ గజ్వేల్ పట్టణంలోని చేనేత సహకార సంఘంలోపదవ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఒంటిగంట వరకు బ్యాలెట్ పద్ధతిలో ఉంటుందని అదే రోజు ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారని అన్నారు. నామినేషన్ రుసుము జనరల్ అభ్యర్థులకు వెయ్యి రూపాయలు కులధృవీకరణ పత్రం కలిగి ఉన్న అభ్యర్థులకు 750 రూపాయలు ఉంటుందని అలాగే ఫలితాలు వచ్చాక మూడు రోజుల్లో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించిన ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

బాలాపూర్, జూన్ 30, (ప్రజా కలం).

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కార్యాలయంలో బి ఎల్ ఓ లు మరియు బి ఎల్ ఏ లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్ కార్యక్రమం అమలు విధానం, ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, అర్హులైన ప్రతి ఓటరికి సేవలు అందించే ప్రక్రియతో పాటు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు కాలనీల్లో ఇంటింటికీ పర్యటిస్తూ ప్రజలకు ఎన్యూమరేషన్ (ఏనుమేరేషన్ ) ఫారాలను అందజేశారు. ప్రతి అర్హ ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులను నిర్ణీత సమయంలో పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే సర్ కార్యక్రమం ఉద్దేశ్యం, ఓటరు జాబితా ప్రాముఖ్యత, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో సరైన వివరాలతో ఉండాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఇంటికి చేరుకుని అవగాహన కల్పిస్తూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి సూచించారు.ఈ సమావేశంలో ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, బి ఎల్ ఓ సుస్మా , తరుణ్, ధన్‌సింగ్ నాయక్, అంజన్ కుమార్, రవీందర్ రావు, బి ఎల్ ఏ లు, నాయకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



# కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**- ఉద్యోగ కార్మిక కర్షక ఐక్యతతో ప్రభుత్వ విధానాలను ఎదిరించాలి**

**- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**




మహేశ్వరం, జూన్ 30,(ప్రజా కలం)

కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని ఈ విధానాలను తిప్పి కొట్టడానికి కార్మిక కర్షక ఉద్యోగ పేదల ఐక్యమత్యంతో వ్యతిరేకించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు కార్మికులకు పిలుపునిచ్చారు. కందుకూరు మండల కేంద్రంలో ఈరోజు జరిగిన మహేశ్వరం కందుకూరు బాలాపూర్ మండలాల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని దీని ద్వారా పోరాడి. సాధించుకున్న చట్టాలన్నీ నిర్వీర్యం అయిపోతాఅని పర్వతాలు తెలిపారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు కార్మిక సంఘాలు పోరాటం నిర్వహించాలని ఆయన తెలిపారు. వ్యవసాయ నల్ల చట్టాలను విద్యుత్ చట్టాలను నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పర్వతాలు కోరారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పనిగంటలు అమలు చేయడం లేదని వారు విమర్శించారు.

ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ మహాసభలో తీర్మానం ప్రవేశ పెడుతూ మాట్లాడారు నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహా రించాలి విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఆపాలి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి ఈ ఎస్ ఐ హాస్పిటల్ ని ఏర్పాటు చేయాలి మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి అధిక ధరలను అరికట్టాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి వలస కార్మిక చట్టాలను అమలు చేయాలి పై డిమాండ్స్ ను తక్షణమే అమలు చేయాలని.

మహేశ్వరం కందుకూరు బాలాపూర్ మండలం మహాసభ డిమాండ్ చేశారు. ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మ గళ్ళ రాజు దేవేందర్ గౌడ్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బ్రహ్మాచారి ప్రవీణ్ యాదగిరి రవి కోటేష్ సాంసంన్ రేడియా నాయక్ లక్ష్మారెడ్డి కవిత, నల్ల వీని మరియమ్మ, సిద్దు శివ తదితరులు పాల్గొన్నారు.



# కోటి పరిహారం ఆచూకీ లేదు

**సిగాచి బాధితులకు న్యాయం ఎక్కడ.?..**

**ఏడాది గడిచినా అమలు కాని కోటి పరిహారం: గూడెం మహిపాల్ రెడ్డి..**




పటాన్‌చెరు, జూన్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

సిగాచి పరిశ్రమ ఘోర ప్రమాదానికి ఏడాది పూర్తయినా మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కోటి రూపాయల నష్టపరిహారం అమలు కాకపోవడం ప్రభుత్వ వైఫల్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రమాదానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బీపీఎల్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో మృతి చెందిన కార్మికులకు ఆయన నివాళులర్పించారు. గత ఏడాది జూన్ 30న జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందగా, ఎనిమిది మంది ఆచూకీ ఇంకా లభించలేదని 40 మంది తీవ్ర గాయాలతో బాధపడుతున్నారని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి రూ.60 లక్షల పరిహారం అందించామని చెప్పడం వాస్తవం కాదని, సెబీ రూ.118 కోట్ల పరిహారం చెల్లించాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి ఒత్తిడితోనే ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇచ్చిందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన కోటి రూపాయల పరిహారం వెంటనే చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ కల్పించాలని గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే భారత రాష్ట్ర సమితి తరఫున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..

## ఓటర్ల సవరణపై కాంగ్రెస్ సమీక్ష..

పటాన్‌చెరు, జూన్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా



నుంచి తొలగిపోకుండా చూడాలని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పార్టీ నాయకులకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బూత్ స్థాయి ఏజెంట్ల ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసేలా ఇన్‌చార్జిలు నిరంతరం పర్యవేక్షించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అర్హులైన ఓటరు పేరు జాబితా నుంచి తొలగిపోకుండా ఎప్పటికప్పుడు పనితీరును సమీక్షిస్తూ అవసరమైన సూచనలు అందించాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కాట శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు..

## అయ్యప్ప నగర్ కాలనీలో రోడ్డు మరమ్మత్తు చేయాలని మున్సిపల్ కమిషనర్ వినతి పత్రం అందజేత



**గజ్వేల్ : 30 జూన్ ( ప్రజా కలం ప్రతినిధి)**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని అయ్యప్ప నగర్ కాలనీలో గల రాజీవ్ పార్క్ రోడ్డు నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు గల ప్రధాన రోడ్డును అమృత్ సంస్థ వారు పైపులైన్ పనుల నిమిత్తం రోడ్డును ఒకవైపు డ్రిల్లింగ్ మిషన్ల సహాయంతో మంచిగా ఉన్న రోడ్డును తవ్వి పైపులైనుల మరమ్మతుల అనంతరం అలానే వదిలేశారని ఆ రోడ్డును ప్రయాణికులకు సౌకర్యంగా యధావిధిగా మరమ్మతులు చేపించాలని అయ్యప్ప నగర్ కాలనీవాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్ గారికి చైర్మన్‌కి వినతి పత్రం అందించారు అనంతరం కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ్ల స్వామి ప్రధాన కార్యదర్శి మోతె వీరారెడ్డి సభ్యులతో కలిసి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి అయ్యప్ప నగర్ కాలనీలోని రహదారులపై వివక్ష చూపిస్తున్నారని గతంలో చాలాసార్లు కాలనీలోని రోడ్లను మరమ్మతులు చేపించాలని సి సి రోడ్లుగా మార్చాలని అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు గతంలో మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సీ సీ రోడ్లు ప్రజల నివాసము లేని ఓపెన్ ప్లాట్ల వద్ద అవసరం లేని రోడ్లలో సిసి రోడ్లు వేశారని నిత్యం ప్రజలు కాలనీవాసులు ప్రయాణించే గజ్వేల్ పట్టణం లోని రాజీవ్ పార్కు,రాజిరెడ్డి పల్లి గ్రామము,మహంకాళి దేవాలయము కు ప్రజలు వెళ్లే దారి అయినటువంటి అయ్యప్ప నగర్ కాలనీ ప్రధాన రోడ్లను నిర్లక్ష్యం చేసినారని అన్నారు ఇప్పటికైనా ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం కమిషనర్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి ప్రధాన కాలనీ అయిన అయ్యప్ప నగర్ లోని రోడ్లను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేసినామని అన్నారు కాలనీవాసుల విజ్ఞప్తిపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించినారని ఆనందం వ్యక్తపరిచినారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ్ల స్వామి,ప్రధాన కార్యదర్శి మోతే వీరారెడ్డి, కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, కాలనీ సభ్యులు వగ్గు మల్లేశం,ఎంకన్నగారి గోపాల్ రెడ్డి,గురప్పగారి శ్రీరాములు,రేకుల కృష్ణారెడ్డి, బుస్స పండరి, కొట్టాల యాదగిరి, రంగు శ్రీనివాస్, కోల సూర్యారావు,కాశిరెడ్డి బాల్ రెడ్డి,నాగరాజు, గుజ్జేటి కిరణ్, మారుపల్లి సంజయ్, కాశిరెడ్డి సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సెంట్ మేరీ స్కూల్‌లో విఘ్నేశ్వరుడి పోస్టర్‌పై అభ్యంతరకర రాతలు

**పోస్టర్ తొలగించిన భజరంగ్ దళ్ కార్యకర్తలు**

గజ్వేల్:30 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సెంట్ మేరీ స్కూల్‌లో విఘ్నేశ్వరుడి చిత్రంతో ఏర్పాటు చేసిన పోస్టర్‌పై అభ్యంతరకరంగా రాతలు ఉన్నాయని ఆరోపిస్తూ మంగళవారం భజరంగ్ దళ్ కార్యకర్తలు స్కూల్‌కు చేరుకున్నారు.స్కూల్ యాజమాన్యంతో మాట్లాడిన అనంతరం ఆ పోస్టర్‌ను తొలగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా భజరంగ్ దళ్ జిల్లా బలోపాసన ప్రముఖ్



ఎర్రవాడ అరవింద్ మాట్లాడుతూ, హిందూ ధర్మం, దేవతా మూర్తులను అవమానించే లేదా వారి మనోభావాలను దెబ్బతీసే చర్యలను సహించబోమన్నారు. ప్రజ్ఞాపూర్ సమీపంలోని జగదేవ్‌పూర్ రోడ్డులో ఉన్న సెంట్ మేరీ స్కూల్‌లో విఘ్నేశ్వరుడిపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టర్ ఏర్పాటు చేశారనే సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పోస్టర్‌ను తొలగించినట్లు తెలిపారు.అలాగే, గతంలో కూడా ఇదే స్కూల్‌లో



విద్యార్థుల చేతి రాఖీలు, కంకణాలు తొలగించడం, బాలికల గాజులు తీయించడం వంటి ఘటనలపై యాజమాన్యంతో మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు.ఇకపై హిందూ సంప్రదాయాలు, దేవతల పట్ల అవహేళన జరిగితే భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్కూల్‌పై ఆందోళనలు చేపట్టి,అవసరమైతే స్కూల్‌ను పూర్తిగా బంద్ చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ నగర సంయోజక్ లఖన్, నగర గోరక్ష ప్రముఖ్ ఊడుగుల శ్రీకాంత్, ప్రఖండ సురక్ష ప్రముఖ్ నితిన్, నగర సురక్ష ప్రముఖ్ కాల సంపత్, కార్యకర్తలు జమలపూర్ నాగరాజు,సాయి, రాజేష్,రాకేష్, కన్ని,గణేష్,మహేష్,శ్రీధర్,చందు, శ్రీకాంత్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు బి ఎల్ ఏ లే కీలకం

**- సర్ ప్రోగ్రాం విజయవంతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతర కృషి**
**- మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లమూర్ గ్రామ**
**- బి ఎల్ ఏ డిల్లి శ్రీధర్ ముదిరాజ్**

కందుకూరు, జూన్ 30,(ప్రజా కలం)
కందుకూరు మండలం పరిధిలోని లమూర్ గ్రామం లో 538,539,540 పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహించిన సర్ ప్రోగ్రాంలో మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు



లమూర్ గ్రామ బి ఎల్ ఏ డిల్లి శ్రీధర్ ముదిరాజ్ బి ఎల్ ఓ ల ఇంచార్జి గ్రామ జిపిఓ నాగరాజు బి ఎల్ ఓ లు గుల్వి శ్రీలక్ష్మి కటికెల రాణి , ఢిల్లీ శైలజ గార్లతో పాటు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచాల భాస్కర్, గుల్వి దేవేందర్,వార్డ్ మెంబర్ మంచాల లక్ష్మయ్య, సూరసాని యాదగిరి రెడ్డి ఎస్సి సెల్ ప్రెసిడెంట్ డప్పు పోచయ్య చిన్నగాళ్ల రవీందర్ జంగిలి బన్నీ,సూరసాని అంజిరెడ్డి గార్లతో కలిసి పాల్గొనడం జరిగిందిఈ సందర్భంగా డిల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఓటరు జాబితా పటిష్టీకరణ, ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరగడం, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం మా లక్ష్యం. బూత్ స్థాయి నుండి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఓటరి హక్కును కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం బలమైన బూత్ నిర్మాణమే బలమైన విజయానికి పునాది అని అన్నారు.రాబోయే ఎలక్షన్ దృష్టిలో పెట్టుకొని ఓట్ల సవరణ పై ప్రతి ఒక్కరు అప్రమతంగా ఉండాలని కష్టపడి పని చేయాలని అన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్ఏ సామ్యూల్ రాజ్



మహేశ్వరం, జూన్ 30,(ప్రజా కలం)
మహేశ్వర్ నియోజకవర్గం మంఖల్ గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ వెంకటేశ్వరి, జీపీఓ సత్యనారాయణ 418 బూత్ బీఎల్ఏ సామ్యూల్ రాజ్ కలిసి ఓటర్ ఫారంలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫారంల వినియోగం, నమోదు వివరాల సవరణపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు సలహాలు చేశారు.

# అమీన్పూర్‌లో రూ.5.20 కోట్ల అభివృద్ధి షురూ..

అమీన్పూర్ జూన్ 30 (ప్రజా కలం) ప్రతినిధి
అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో రూ.5 కోట్ల 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారులు, మధ్య విభాజకం, పాదచారుల మార్గం, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఫ్రైడ్ పార్క్ కాలనీ, సన్‌వే ఓపస్ కాలనీల్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సీసీ రహదారులు, మురుగునీటి కాలువలు, పార్కులు, వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. అమీన్పూర్‌ను గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా, నగరపాలక సంస్థగా అభివృద్ధి చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. అమీన్పూర్, బీరంగూడ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న కాలనీలకు అవసరమైన మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ ఉపేందర్, కొల్లూరు చంద్రకళ గోపాల్, నవనీత జగదీష్, బిజిలి రాజు, తల్లారి రాములు, చౌటకూరి బాలరెడ్డి, కొల్లూరి యాదగిరి, చౌటకూరి మహిపాల్ రెడ్డి, సునీత, రాజశేఖర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు..






# ప్రక్రియ పరిశీలన.. ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన.

**- మంతూర్ గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యటన.**

సిద్ధిపేట ప్రజాకలం జూన్ 30.
రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియ తీరును రాయపోల్ ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2026పై ప్రజాప్రతినిధులు, గ్రామ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. తర్వాత అంగన్‌వాడీ--3 కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్వేజ్, ఉపసర్పంచ్ బంధారం సంతోష్ కుమార్, గ్రామ కార్యదర్శి ఎస్కే మాషుమ్ అలీ, వార్డు సభ్యులు దయ్యల పోచయ్య, మన్నే వరలక్ష్మి చిరంజీవి, టి. వజ్రమ్మ, పడిగే రవీందర్, పడిగే శ్యామల మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్నం యాదగిరి, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# భారత రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి: బక్కి వెంకటయ్య.

సిద్ధిపేట ప్రజాకలం జూన్ 30.
భారత రాజ్యాంగం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన డీబీఎఫ్ సిద్ధిపేట జిల్లా 11వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధించిన “బోధించు--సమీకరించు--పోరాడు” అనే సూత్రాన్ని డీబీఎఫ్ ఆచరిస్తోందన్నారు. తన చైర్మన్ పదవీకాలం ముగిసిన తర్వాత డీబీఎఫ్‌లో చేరి ఆత్మగౌరవ ఉద్యమంలో భాగస్వామి అవుతానని తెలిపారు.
దేశంలో, రాష్ట్రంలో ఎక్కడ దళితులకు అన్యాయం జరిగినా డీబీఎఫ్ బాధితుల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకొని బానిసత్వం నుంచి విముక్తి పొందాలని, సమాజ మార్పు కోసం ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను వ్యతిరేకించాలని కోరారు. యువత ఉన్నత విద్యను అభ్యసించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవి రవీందర్, మాదాసు శ్రీనివాస్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, బీఎస్పీ నాయకులు స్వామి, జర్నలిస్ట్ పుట్టరాజు, మామిడాల సర్పంచ్ పోచయ్య, జాఫర్ భాయ్, బండారు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి గొండస్వామి భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు.
డీబీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక
డీబీఎఫ్ సిద్ధిపేట జిల్లా 11వ మహాసభలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బ్యాగరి వేణు, ఉపాధ్యక్షులుగా పోతరాజు శంకర్, ప్రధాన కార్యదర్శిగా భీమ్ శేఖర్, కార్యదర్శిగా సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. సభ్యులుగా ఏలూరు నరసయ్య, సింగాటం చంద్రం, తిగుల్ యాదగిరి, నరసమ్మ, చందరాజు, కిరణ్, రవి, శ్రీను, నరసింహులు ఎన్నిక కాగా, జిల్లా సలహాదారులుగా మామిడాల సర్పంచ్ పోచయ్య, జర్నలిస్ట్ పుట్టరాజులను ఎంపిక చేశారు.

# నేదునూరు మోడల్ స్కూల్ ను సందర్శించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామచందర్



కందుకూరు, జూన్ 30,(ప్రజా కలం)
సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామచందర్ మండల బృందం తో కలిసి నేదునూరు మోడల్ స్కూల్ ను సందర్శించడం జరిగింది. అక్కడ ఉన్నటువంటి సమస్యల్ని వెలికి తీయడం జరిగింది. మోడల్ స్కూల్ రాష్ట్రంలోనే మంచి రిజల్ట్ తో పనిచేస్తున్నది సరిపడ టీచర్లు మంచి విద్యను అందించే దాని కోసం ప్రయత్నం జరుగుతున్నది మొత్తం 762 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యం నాసిరకంగా పురుగులతో కూడుకొని ఉన్నది విద్యార్థులు చదువుకొని దేశ భవిష్యత్తును మార్చే బావి భారత పౌరులుగా, ప్రయోజకులుగా కావాలని చెప్పేసి ప్రభుత్వం వేదికలలో గొప్ప గొప్ప మాటలు చెప్తూనే, వాళ్లకి పోషక ఆహారం అందించే దాంట్లో ప్రభుత్వం విఫలమైందని అన్నారు పేరుకే సన్న బియ్యం కానీ పురుగులతో ఉండటం వల్ల బియ్యం నాణ్యతను కోల్పోయి ఎటువంటి కూరలు కలుపుకున్న తిన్న రుచిపచి లేకుండా ఉంటున్నది మొత్తం 762 మంది భోజనం చేయాల్సిన దగ్గర రోజువారిగా 150 మందికి మించి తినటం లేదు కారణమేందంటే నాసిరకం అయిన బియ్యం వల్ల అజీర్తి అయ్యి గ్యాస్ ఫామ్ అవటం వల్ల పిల్లలు స్కూల్లో తినటానికి ఇష్టపడట్లేదని తెలియజేశారు ప్రభుత్వం గొప్ప గొప్ప మాటలు చెబుతూ సన్నబియ్యంతో రాష్ట్ర భవిష్యత్తును మార్చుతామని చెబుతున్న ప్రభుత్వం ఇటువంటి నాసిరకమైన బియ్యంతో పురుగుల అన్నంతో విద్యార్థుల భవిష్యత్తు మార్చ లేరని అన్నారు మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్తితి చాలా అధ్వాన్నంగా ఉందన్నారు గుడ్డు రేటు 8 రూపాయలు అయినప్పటికీ ప్రభుత్వం 5 రూపాయలు మాత్రమే ఇస్తుందన్నారు దానివల్ల వారు తన సొంత కష్టంలోనుంచి గుడ్లకు కేటాయించాల్సి వొస్తుంది అన్నారు. కురాగాయలు, నూనె,పప్పులు,గ్యాస్ ధరలు విపరీతంగా పెరగటం వలన అప్పులు చేసి పిల్లలకోసం ఖర్చుచేస్తున్నామని అక్కడ మధ్యాహ్న భోజన కార్మికులు గోడు వెళ్లబోసుకున్నారు వారిని ఆదుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేశారు.దీనిపై జిల్లా విద్యాధికారులు, జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే దీనిపై స్పందించి నాసిరకమైన బియ్యం పంపిణీ కాకుండా నాణ్యత కలిగిన బియ్యాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న కాలంలో పెద్దయెత్తున ఆందోళన పోరాడుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల కమిటీ సభ్యులు బుడ్డీరపు శ్రీనివాస్ అంకగళ్ల కుమార్, మల్లేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల హక్కులకై పోరాటం

**ఏఐటీయూసీ బాలాపూర్ మండల రెండవ మహాసభ**

**బాలాపూర్ మండలం ఏఐటియుసి అధ్యక్షులుగా కామ్రేడ్ వి లక్ష్మారెడ్డి**

బాలాపూర్, జూన్ 30,(ప్రజా కలం)
మహాసభలో బాలాపూర్ మండలం ఏఐటియుసి అధ్యక్షులుగా కామ్రేడ్ వి లక్ష్మారెడ్డి ని ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ జటావత్ రెడ్యా నాయక్ ని ఏకగ్రీవంగా




ఎన్నుకోవడం జరిగింది.సహాయ అధ్యక్షులుగా లక్ష్మయ్య ఇంద్రానగర్ సహాయ కార్యదర్శిగా మాసయ్య కోశాధికారిగా ఆశీర్వాద్ సభ్యులుగా విజయ్ కుమార్ బడంగ్పేట్ కొండయ్య మల్లాపూర్ ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఎన్నుకోబడిన సభ్యులందరూ కార్మికులకు అందుబాటులో ఉండాలని వారి సమస్యలపై పోరాడాలని బాలపూర్ మండలంలో కార్మికులకు సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా లేబర్ కార్డు జీవిత బీమా చిన్నచిన్న ప్రమాదాల వల్ల జరిగే నష్టాలకు ఎన్నుకోబడిన సభ్యులు వారికి అండగా ఉంటారని కోరుకుంటూ బాలాపూర్ మండలం నుంచి ఏఐటియుసి సంఘానికి ఎన్నుకోబడిన సభ్యులందరికీ బాలాపూర్ మండల సమితి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల కార్యదర్శి సిపిఐ పార్టీ ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా రంగంపేట చేనేత సహకార సంఘం ఎన్నికలు

మెదక్ జూన్ 30(ప్రజాకలం ప్రతినిధి) విజయవంతంగా రంగంపేట చేనేత సహకార సంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో చేనేత సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.



ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సహకార శాఖ సహాయ రిజిస్టర్ ఎండి ఫసియుద్దీన్ మాట్లాడుతూ మొత్తం 9 మంది డైరెక్టర్ స్థానాలకు గాను 14 మంది పోటీ చేయగా 9 మంది డైరెక్టర్లుగా అల్లి ప్రసాద్, పాడెపు వెంకటేశం, బోద్దుల వెంకటనారాయణ, పద్మ సత్యనారాయణ, మసుర సంతోష్ కుమార్, నీలకంటి యాదగిరి, బొద్దుల హరిదాస్, భూపతి వెంకటలక్ష్మి, మద్దెల పల్లవి గెలుపొందారని వారు తెలిపారు. అనంతరం గెలుపొందిన డైరెక్టర్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా బోద్దుల వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా పాడేపు వెంకటేశం, సెక్రటరీగా అల్లి ప్రసాద్ ( చందు ) , క్యాషియర్ గా మద్దెలపల్లవిలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం అధ్యక్షులు బొద్దుల వెంకటనారాయణ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సంఘం సభ్యులు కార్యాలయం ఎదుట టపాసులు కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.

# గౌరారం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సిద్దిపేట సీపీ సాధన రశ్మి పెరుమాళ్..

**-వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డుల పరిశీలన..**
**-ప్రజలతో మర్యాదగా మెలగాలని పోలీసులకు సూచన చేసిన సిపి రష్మీ పెరుమాళ్..**

గజ్వేల్ నియోజకవర్గం:30 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )
వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ మంగళవారం గజ్వేల్ డివిజన్ లోని గౌరారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు పూల బొకేతో కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు.అనంతరం గజ్వేల్ ఏసీపీ నర్సింలుతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన కమిషనర్, స్టేషన్ నిర్వహణతో పాటు కీలక రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న గౌరారం పోలీసులను అభినందించిన ఆమె, స్టేషన్‌లోని ముఖ్యమైన రికార్డులను నిబంధనల ప్రకారం భద్రంగా నిర్వహించాలని ఆదేశించారు.వార్షిక తనిఖీల ఉద్దేశ్యం పోలీస్ స్టేషన్‌ల పనితీరును మరింత మెరుగుపరచడం, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడడమేనని కమిషనర్ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.



# కమ్మర్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

## : అధ్యక్షుడిగా తెడ్డు రమేష్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 30:
లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ తాజా మాజీ అధ్యక్షుడు లుక్కా గంగాధర్ తెలిపారు. మంగళవారం కమ్మర్‌పల్లిలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్లబ్ సర్వసభ్య




సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.క్లబ్ నూతన అధ్యక్షుడిగా తెడ్డు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎండి హైమద్, కోశాధికారిగా సుంకరి విజయ్ కుమార్ ఎన్నికైనట్లు లుక్కా గంగాధర్ అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. నిరుపేదలకు అండగా ఉంటూ, సమాజ అభివృద్ధికి తమ వంతు విశేష కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గానికి పలువురు సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ తాజా మాజీ ప్రధాన కార్యదర్శి రేవతి గంగాధర్, లయన్స్ సభ్యులు చింత ప్రదీప్, సూరంగి చంద్రశేఖర్, పడిగేలా ప్రవీణ్, లింగారెడ్డి, రవీందర్ సర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

వలిగొండ జూన్ 30 ప్రజాకలం:బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన వలిగొండ మండల పరిధిలోని మందాపురంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేకుల సోమారం గ్రామానికి చెందిన బొల్లారం గణేష్



(25) మంగళవారం రోజున తన తండ్రి నెల మాసికం సందర్భంగా సరుకులు తేవడానికి మరొక వ్యక్తితో కలిసి వలిగొండకు వెళ్లాడని, ప్రమాదవశాత్తు మాందాపురం మూలమలుపు వద్ద నడుపుతున్న బండి యొక్క ముందు చక్రం గుంతలో పడటంతో ఎగిరి కింద పడ్డారు.దీనితో గణేష్ తల నేరుగా రోడ్డుపై తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో వలిగొండలోని రేణుక దేవి ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించాగ,పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.

# వికలాంగులకు ఉచిత బస్సు పాస్ మేళా

భూదాన్ పోచంపల్లి జూన్ 30 ( ప్రజా కలం )
టిఆర్ యువసేన ఆధ్వర్యంలో గురువారం టి,ఆర్ ఫౌండేషన్ చైర్మన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక పద్మశాలి సభా వేదిక వద్ద వికలాంగులకు ఉచిత బస్సు పాస్ మేళను నిర్వహిస్తున్నారని టీఆర్ఎస్ యువసేన అధ్యక్షుడు వలం దాస్ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సురేష్ కుమార్ హాజరవుతున్నారని వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై బస్సు పాస్ మేలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# సిరికొండ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలు చేసిన పోలీస్ కమీషనర్

## - ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలి
## -ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలి -నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి



**నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) జూన్ 30:**
మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ. పి. ఎస్. ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ గారికి పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవ వందనం అందించగా , ఆయన వందనాన్ని స్వీకరించి అనంతరం,మొక్క నాటడం జరిగింది తదుపరి స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్ , భద్రతా పరికరాలు,ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం , ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి,వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్, కేసుల నమోదు , పెండింగ్ కేసుల దర్యాప్తు , బీట్ డ్యూటీ వ్యవస్థ , రౌడీషీటర్లు మరియు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టేషన్‌లో అమలవుతున్న “5 ఎస్ విధానం” అమలు తీరును సమీక్షించి, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల డిజిటల్ నిర్వహణ , సిబ్బంది హాజరు , డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో,పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని,ప్రతి కేసులో నాణ్యమైన,ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని,సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు,కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి,అట్టి ప్రాంతాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. సిరికొండ పోలీస్ స్టేషన్ సరిహద్దులో ఉన్నటువంటి జగిత్యాల,సిరిసిల్ల , కామారెడ్డి ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని అన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి , చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసము యువతను ఎల్లప్పుడూ చైతన్య వంతులను చేయాలని మరియు అన్ని గ్రామాలలో డ్రగ్స్ వాడకం నిషేధము అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24x7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో నిజామాబాదు ఎ.సి.పి బి. ప్రకాష్ యాదవ్ , ధర్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.బిక్షపతి,సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ బి. అంజయ్య , సిరికొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె. రామకృష్ణ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

## - రైతులు ఆందోళన చెందొద్దు.. కలెక్టర్ గరిమ అగ్రవాల్.




రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (ప్రజా కలం ప్రతినిధి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఫెర్టిలైజర్ యాప్, ఎరువుల సరఫరాపై మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో 19,513 మంది రైతులు ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 60,254 యూరియా సంచులను బుక్ చేసుకున్నారని తెలిపారు. ఇందులో 50,283 సంచులను రైతులు సమీప డీలర్ల నుంచి తీసుకెళ్లగా, మరో 9,830 సంచులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 12,292 యూరియా సంచులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 20 రైతు వేదికలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, నిల్వలు కనిపించకపోతే రిఫ్రెష్ చేసి పరిశీలించాలని రైతులకు సూచించారు.యూరియా సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మొద్దని, పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.ఈ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలను సిద్ధంగా ఉంచాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొలిపాక నరసయ్య




వేములవాడ, జూన్ 30 ( ప్రజా కలం ప్రతినిధి) :వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ నాలుగవ వార్షిక ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం మంగళవారం స్థానిక ఇన్ కేబుల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని బాధ్యతలు అప్పగించారు. అధ్యక్షుడిగా కొలిపాక నరసయ్య, జనరల్ సెక్రటరీగా ఈసంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా తోట శేఖర్ బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్ అనంతుల శివప్రసాద్, రీజినల్ చైర్‌పర్సన్ మారం కుమార్, జోనల్ చైర్‌పర్సన్ కటకం శ్రీనివాస్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ తీగల వెంకటేశ్వరరావు, వేములవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వంశీకృష్ణ, కార్యదర్శి కొమ్ము నటరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజన్న లయన్స్ క్లబ్ గత మూడు సంవత్సరాలుగా నిరంతర సేవా కార్యక్రమాలతో సమాజానికి విశిష్ట సేవలందిస్తూ నాల్గవ సంవత్సరంలోకి అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 50 ఉచిత వైద్య శిబిరాలు, ఐదు కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు 50 మంది నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడం విశేషమన్నారు.

యోగా శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత చేరువై ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు డ్రగ్స్, మద్యపానం, ఇతర వ్యసనాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గోస్కుల రవి, పశువుల అంజి నరేందర్, తోట ఆంజనేయులు, సుమన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు

## - హిందీ పండిత్ తీగల సత్యనారాయణకు ఘన సన్మానం.

వేములవాడ, జూన్ 30 ( ప్రజా కలం ప్రతినిధి) : శాస్త్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన తీగల సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు ఉపాధ్యాయులు, బాల్యమిత్రులు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం తీగల సత్యనారాయణను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, బాల్యమిత్రులు ఎల్లాల ఆనంద్‌రెడ్డి, తాహేర్ పాషా, మోటూరి మల్లేశం, దుర్గం పరశురాం, కొలిపాక శ్రీనివాస్, లాయక్ పాషా, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.










## సేవకు చిరునామా...

# పేదల ఆశాకిరణం నిత్యసాయి ట్రస్టు.

### నిస్వార్థమైన సేవకు మారుపేరుగా నిలుస్తున్న నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ..

### ప్రజా కలం ప్రత్యేకం..

### మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న నిత్యసాయి 23 ఏళ్ల సేవా ప్రస్థానంపై "ప్రజా కలం" ప్రత్యేక కథనం





**మెట్‌పల్లి: కోరుట్ల ప్రతినిధి జూన్ 30 (ప్రజా కలం)**

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే మహోన్నత లక్ష్యంతో ప్రారంభమైన నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్, రెండు దశాబ్దాలకు పైగా నిరంతర సేవా కార్యక్రమాలతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. 2002లో స్థాపించబడిన ఈ ట్రస్ట్ "మానవ సేవే మాధవ సేవ" అనే సిద్ధాంతంతో ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ 23 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, నిరుపేద ప్రజలకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వేలాది మంది ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించింది. మహిళల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఉచిత గైనకాలజీ సేవలు, ఫెర్టిలిటీ చికిత్సలు, ఆరోగ్య సలహాలు అందించింది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మహిళల ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రత, సంతానోత్పత్తి ఆరోగ్యంపై విస్తృత ప్రచారం చేపట్టింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తపోటు, మధుమేహం, రక్తంలో చక్కెర, థైరాయిడ్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు పేద రోగులకు ఉచిత మందుల పంపిణీ కూడా చేపట్టింది. మారుమూల గ్రామాలకు వెళ్లి ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించింది. తల్లి, శిశు సంక్షేమ రంగంలో కూడా ట్రస్ట్ విశేష సేవలు అందిస్తు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటుంది. హైరిస్క్ గర్భిణులకు, నెలలు నిండక ముందే పుట్టిన శిశువులకు ప్రత్యేక వైద్య సహాయం అందించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉచితంగా లేదా తక్కువ ధరలతో ప్రసూతి సేవలను అందిస్తున్న ఈ ట్రస్ట్ గర్భిణుల కోసం ప్రసవానికి ముందు, ప్రసవానంతర వైద్య సంరక్షణ కార్యక్రమాల క్యాంపులను ఏర్పాటు చేస్తుంది. కంటి, దంత వైద్య శిబిరాలు, తక్కువ ఖర్చుతో శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య సేవలు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ, వృద్ధులు, అనాథల సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలను ట్రస్ట్ విజయవంతంగా నిర్వహిస్తునే ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ట్రస్ట్ తన సామాజిక బాధ్యతను నిర్వర్తించింది. వరదల వంటి విపత్తుల సమయంలో ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంతో పాటు బాధిత కుటుంబాలకు వైద్య సహాయం, అత్యవసర సేవలు అందించింది. 2025లో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "ఏబీ హాస్పిటల్ (ఆరోగ్య భారత్)"ను ప్రారంభించడం మరో కీలక మైలురాయిగా నిలిచింది. పేద మరియు దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అందరికీ అందుబాటులో ఉండే ఓపి ఫీజుతో ఆధునిక వైద్య సేవలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతోంది. సంరక్షణ -- సేవ -- ఆరోగ్యం అనే నినాదంతో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆరోగ్య పరిరక్షణ, కరుణ, సేవ అనే విలువలను ముందుకు తీసుకెళ్తూ సమాజ సేవలో తన ప్రత్యేక పాత్రను కొనసాగిస్తోంది. గత 23 ఏళ్లుగా వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించిన ఈ ట్రస్ట్, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తూ ఈ ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజల మన్ననలను అందుకుంటుంది.




23 YEARS OF CARE, COMMITMENT & COMPASSION
SINCE 2002 - 2025
OUR SUCCESS STORIES













## మహిళా ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ క్యాంపులు - డాక్టర్ హేమారెడ్డి



పౌష్టికాహార ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే మహిళల్లో రుతు సంబంధ సమస్యలపై సరైన అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావడం లక్ష్యంగా నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు యండి, ఒబిజి, పునరుత్పత్తి వైద్యంలో మాస్టర్స్, వంధ్యత్వం, ఐవీఎఫ్ లో అడ్వాన్స్‌డ్ ఫెలోషిప్, డైరెక్టర్, ప్రధాన సంతాన సాఫల్య సలహాదారు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ హేమారెడ్డి వెల్లడించారు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ట్రస్ట్ సేవలందిస్తోందని డాక్టర్ హేమ రెడ్డి వెల్లడించారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే నిత్యసాయి ట్రస్టు - డాక్టర్ రఘు.




నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించినట్లు ఆరోగ్య సంరక్షణ విప్లవ వ్యవస్థాపకులు ఎంబిబిఎస్, ఎఫ్ఈఎం, డిప్లొమా ఇన్ డయాబెటాలజీ డాక్టర్ రాఘవేందర్ రావు. సిహెచ్ పేర్కొన్నారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంతో పాటు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని డాక్టర్ రఘు వివరించారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com